08 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 130 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper




## సీఎం నివాసంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమావేశం.

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
సీఎం నివాసంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమావేశం. హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. బుధవారం రోజున హైకోర్టులో బీసీ రిజర్వేషన్ కేసు విచారణ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, వినిపించాల్సిన వాదనలపై చర్చ.

## హైకోర్టు తీర్పుకు లోబడే గ్రూప్-1 నియామకాలు

### స్టే ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ,అక్టోబరు7 ( వెలుతురు):**
తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై అడ్డంకులు తొలిగాయి. దీనిపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు

# విజయవంతంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు

- లబ్ధిదారులే నిర్మాణ కర్తలు - మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మఇండ్ల పై ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే ఆరా
- ఖర్గేను పరామర్శించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ని పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు, చెల్లింపులు లబ్ధిదారుల ఎంపిక విధానం, ఒక్కో ఇంటికి యూనిట్ కాస్ట్ తదితర

# భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### ప్రకటించిన నోబెల్ కమిటీ

**న్యూఢిల్లీ,అక్టోబర్ 7( వెలుతురు):**
ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ వరించింది. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్ ఆవిష్కరణకు శాస్త్రవేత్తలు జాన్ క్లార్క్, మైఖేల్




# బిసి రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

### మంత్రులు అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

### అభిషేక్ సింఘ్వీతో తాజాగా చర్చ




**హైదరాబాద్,అక్టోబర్ 7( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం



జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. బుధవారం హైకోర్టులో కేసు విచారణకు రానున్న సందర్భంగా మంత్రులు, న్యాయనిపుణులతో చర్చించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల

## డిజిటల్ వ్యవసాయంలో

# అగ్రగామిగా తెలంగాణ

### కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ తో చిన్న, సన్నకారుల రైతుల అనుసంధానం

### సాగు వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యం

### జర్మనీ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలన్నదే సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తమ సంకల్పమని వివరించారు. సాగులో నూతన



ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. కృత్రిమ మేధ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)

## కొమురం భీమ్

# ఆశయసాధనకు కృషి

- ఆదివాసీల అభివృద్ధితోనే ఇది సాధ్యం
- వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,అక్టోబర్7( వెలుతురు):**
ఆదివాసీల అభివృద్ధితోనే కొమరం భీం ఆశయాలు నెరవేరుతాయని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు.





## న్డీఎస్ఏ నివేదిక ప్రకారమే

# కాళేశ్వరం మరమ్మత్తులు

- తుమ్మడిహట్టిపై రెండు ప్రత్యామ్నాయాలు
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,అక్టోబరు7 ( వెలుతురు):**
ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారమే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు చేపడతాం అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.. డిజైన్లు

## తెలంగాణలో

# 80 శాతం పత్తి కొనుగోళ్లు

### సిసిఐ ద్వారానే నేరుగా కొంటాం

### 122 కొనుగోలు సెంటర్ల ఏర్పాటు

### కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్




# ఆర్టీసీ ఛార్జీల పెంపు దారుణం

- ప్రజలపై భారం మోపడమేనన్న కెటిఆర్

**హైదరాబాద్,అక్టోబరు7 ( వెలుతురు):**
తెలంగాణలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ



# పొన్నం,అడ్లూరి మధ్య వ్యవహారం

- పరస్పర విమర్శలతో వేడెక్కిన రాజకీయం
- సమన్వయంతో కలసి ముందుకు వెళ్లాలన్న పిసిసి చీఫ్
- కాంగ్రెస్ అగ్రనేతలను కలిసి ఫిర్యాదు చేస్తానన్న అడ్లూరి


**హైదరాబాద్,అక్టోబర్ 7( వెలుతురు):**
జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రి పొన్నం వ్యాఖ్యలపై తాజాగా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ.. ఓ వీడియోను విడుదల చేశారు.



# పత్తి రైతులకు అండగా ఉంటాం

- సిసిఐకి మాత్రమే పంటలను అమ్ముకోవాలి, • కేంద్రమంత్రి గిరిరాజ్‌తో కిషన్ రెడ్డి చర్చలు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 7( వెలుతురు):**
పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి భరోసా కల్పించారు. అన్నదాతలు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి పంటని అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు.





## హెచ్‌ఎండీఏ కమిషనర్

# రూటే సపరేట్

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
ప్రభుత్వానికి అత్యంత ఆదాయం సమకూరే హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్మెంట్ శాఖ తీరుపై విమర్శలు వెల్లువెతున్నాయి. కనీసం ఎకరా , రెండెకరాలకు కూడా లేఅవుట్లకు అనుమతులు ఇచ్చే పరిస్థితి లేదు. వందల ఫైళ్లు పెండింగ్ లో ఉండటం తో ప్రభుత్వానికి దాదాపు ఆరు వందల కోట్ల ఆదాయం చేజారి పోయే అవకాశం ఉన్నట్లు సమాచారం. పెండింగ్ ఫైళ్లను చూడక కమిషనర్ కాలయాపన చేస్తున్నట్లు అధికార పార్టీ నేతలు చెవులు కొరుక్కోవడం గమనర్హం.ఓవర్ ఆల్ హెచ్ ఎండిఎ అడ్మినిస్ట్రేషన్ ఫైల్స్ గత మూడు నెలలులుగా పెండింగ్ లో ఉన్నట్లు డిపార్ట్మెంట్ వర్గాల సమాచారం.

బాధితులు సగటున మూడు నెలలు తిరిగిన ఎలాంటి ప్రయోజనం లేదు.హెచ్ ఎండిఎ డైరెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు బాగుంది.ఒక పేద రైతు తన వ్యవసాయ భూమిలో లే అవుట్ అనుమతి కోసం అప్లై చేసుకుంటే ఆరు నెలలు గడిచిన ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నేరుగా పైలెవల్ ఉన్నతాధికారులు డిమాండ్ చేయడం తో ఎం చేయలేక వెను దిరిగి పోయినట్లు తెలుస్తోంది.ఇదే తరహాలో మరో బాధితుడు గతంలో ఎసిబి డిజి కి పిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి కింది లెవల్ లో టౌన్ ప్లానింగ్ , డైరెక్టర్లు , ఎపిఓ లు , పిఎఓ లెవల్ లో పెండింగ్ లేనట్లు తేల్చి కేవలం కమిషనర్ దగ్గరే పెండింగ్ లో ఉన్నట్లు చెప్పడం తో బాధితులు అవాక్కయ్యారు. ఏసిబి అధికారుల విచారణ లో భారీ సంఖ్యలో ఫైళ్లు పెండింగ్ లో ఉన్నట్లు తెలిసి నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఆయా పనుల నిమిత్తం ఎవరు వెళ్లిన తనకు పై లెవల్ నుండి అనుమతి ఉంటె తప్ప చెయలెనని సదరు అధికారి చెప్పడంతో సర్కార్ అబాసు పాలు అవుతుందన్న గుసగుసలు ఊపందుకున్నాయి.

hmda

Growing Global

## ప్రైవేట్ వ్యక్తులకు

# అప్పనంగా మెడికల్ కాలేజీలు



- ప్రభుత్వ రంగంలో వైద్య విద్యతను అందకుండా చేసే కుట్ర
- 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శిస్తా
- అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ
- ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాలు సేకరణ
- వైసిపి అధినేత, మాజీసిఎం జగన్ వెల్లడి

**అమరావతి,అక్టోబర్ 7( వెలుతురు):**
ఈనెల 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శిస్తానని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అలాగే అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ కార్యక్రమం ఉంటుందని, మెడికల్ కాలేజీల ప్రైవటీకరణపై కరపత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. కోటి సంతకాలను రచ్చబండ కార్యక్రమాల ద్వారా సేకరిస్తామని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ

## విజయవంతంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు

అంశాలపై ఖర్గే మంత్రి ని అడిగి తెలుసుకున్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే పేదలకు ఐదు లక్షల రూపాయిలతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే సదుపాయాన్ని కల్పించింది. ఇండ్ల పథకాలలో కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఐదు లక్షల రూపాయిలతో నాలుగు వందల చదరపు అడుగులు తగ్గకుండా ఇండ్లను లబ్ధిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. రాష్ట్రంలో గడచిన పది సంవత్సరాలలో పేదలు ఆశించిన మేరకు ఇండ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఇందిరమ్మ ఇండ్లకు డిమాండ్ అధికంగా ఉందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మొదటి దశలో ఈ ఏడాది 22,500 కోట్ల రూపాయిలతో నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 4.50 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని లబ్ధిదారుల ఎంపిక పూర్తికాగా దాదాపు 3 లక్షలకు 5 వేల పైగా ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు స్వయంగా హాజరయ్యారని వివరించారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం, పేదరికమే అర్హతగా ఇండ్లను మంజూరు చేస్తున్నాం. అడవులను నమ్ముకొని జీవించే చెంచులకు సైతం తొలిసారిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రత్యేకంగా ఒక కాల్ సెంటర్‌ను ఇటీవల ఏర్పాటు చేశామని , కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపై 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరుతెన్నులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు సవిరంగా వివరించగా ఖర్గే స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు బాగుందని ఇదే విధంగా ముందుకు సాగాలని మంత్రి పొంగులేటి ని అభినందించారు.


## డిజిటల్ వ్యవసాయంలో అగ్రగామిగా తెలంగాణ

లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం సచివాలయంలో జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ' ప్రతినిధుల బృందంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంది. రాష్ట్ర జనాభాలో సుమారు 55 శాతం మందికి జీవనోపాధి కల్పిస్తోంది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు తన చేయూతను అందిస్తోంది. మరోవైపు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ కు రాష్ట్రం గ్లోబల్ హబ్ గా మారింది. ఇలాంటి తరుణంలో డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను ఆదర్శంగా నిలపాలని సంకల్పించాం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'రోజురోజుకూ వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. పైగా... సాగులో పురుగు మందుల వినియోగం పెరిగి పర్యావరణానికి ఎంతో హానీ జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పెట్టుబడి వ్యయం, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలంటే కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను వ్యవసాయానికి అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగానే మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది' అని వివరించారు. 'అత్యాధునిక సెన్సార్ల ద్వారా నేల స్వభావాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించొచ్చు. ఫలితంగా రసాయనాల కొనుగోలు ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుంది. రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. సుస్థిరమైన, క్లైమేట్-రెసిలియెంట్ వ్యవసాయ పద్ధతులకు మార్గం సుగమం అవుతుంది' అని చెప్పారు. అనంతరం... రాష్ట్రంలో గత రెండేళ్లుగా వేములవాడ కు సమీపంలోని మూడు గ్రామాల్లో 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ' ఆధ్వర్యంలో అమలవుతున్న 'యాక్సిలరేటింగ్ క్లైమేట్-రెసిలియెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చొరవ చూపాలని సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పోరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, జర్మనీ రాయబార కార్యాలయం(న్యూఢిల్లీ) ఫుడ్, అగ్రికల్చర్ డివిజన్ హెడ్ వోల్కర్ క్లైమా, ఫ్రాన్ హోఫర్ హెచ్ హెచ్ ఐ ప్రతినిధులు డా.సెబాస్టియన్ బోస్సే, డా.రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

డెవోరెట్, జాన్ మార్టినిస్‌లకు 2025 భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చినట్లు మంగళవారం నోబెల్ కమిటి తెలిపింది. జాన్‌క్లార్క్, మిచెల్‌హెచ్.డివోరెట్, జాన్.ఎం మార్టిన్స్‌లు ముగ్గురు ఈ అవార్డను సంయుక్తంగా గెలుచుకున్నారు. నోబెల్ భౌతిక శాస్త్ర బహుమతిని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రదానం చేస్తుంది. బహుమతి గెలుచుకున్న ముగ్గురికి మొత్తం 11 మిలియన్ స్వీడిష్ కిరీటాల (శ్రీ1.2 మిలియన్లు) బహుమతి రానుంది. ఈ మొత్తాన్ని వాళ్లు ముగ్గురు పంచుకో నున్నారు. ఇప్పటికే తొలి నోబెల్ బహుమతి వైద్య రంగంలో ముగ్గురు వైద్యులకు సంయుక్తంగా లభించింది. మిగిలిన విభాగాల్లో నోబెల్ బహుమతుల విజేతల పేర్లను అక్టోబర్ 13వ తేదీ వరకు ప్రకటించనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ మరణం తరువాత ఈ నోబెల్ బహుమతులు అందజేస్తున్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన సంపదలో ఎక్కువ భాగాన్ని వివిధ రంగాలలో బహుమతులను అందజేయడానికి వీలునామా రాశారు. 1895 నాటి ఆయన వీలునామా ప్రకారం.. గత ఏడాదిలో, మానవాళికి గొప్ప ప్రయోజనం చేకూర్చిన వారికి బహుమతులు ప్రదానం చేయాలని ఆయన నిర్దేశిరచారు. ప్రతి ఏడాది డిసెంబర్ 10న నోబెల్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజు ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి. ఈ రోజున నోబెల్ బహుమతులు గ్రహీతలకు ప్రదానం చేస్తారు. మొదటి నోబెల్ బహుమతులు 1901లో ప్రదానం చేశారు. నాటి నుంచి ఏటా అందజేస్తున్నారు. అప్పటి నుంచి కొన్ని సార్లు నోబెల్ బహుమతులు ఇవ్వని సందర్భాలు కూడా ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914 నుంచి 1918 వరకు కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధం 1939 నుంచి 1945 వరకు కొనసాగిన సమయంలో నోబెల్ బహుమతులు ఇవ్వలేదు.

## హైకోర్టు తీర్పుకు లోబడే గ్రూప్-1 నియామకాలు



నిరాకరించింది. దీంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఊరట లభించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్-1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా.. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిచడంపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్జిల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపైనా అభ్యర్థుల తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం.. స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా చేపట్టిన నియామకాలన్నీ.. రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. అవకాశం ఉన్నంత త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ కేసుకు ప్రాధాన్యత ఇచ్చి విచారణ పూర్తి చేయాలని సూచిస్తూ.. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ధర్మాసనం ముగించింది.

## బిసి రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరఫున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింగ్వి, సిద్దార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింగ్వి తో ఫోన్ లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింగ్విని కలసి ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు.

# తెలంగాణలో 80 శాతం పత్తి కొనుగోళ్లు

**న్యూఢిల్లీ,అక్టోబరు7 ( వెలుతురు):**

తెలంగాణలో 80 శాతం పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణలో 20 లక్షల మంది పత్తి రైతులు ,18 లక్షల హెక్టార్లలో పత్తి పంట పండిస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు సహకారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక అప్లికేషన్ ప్రారంభించిదని... రైతులు అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో గిరిరాజ్ సింగ్ మాట్లాడారు. గతంలో పత్తిని ఎంత సేకరించామో.. ఈ ఏడాది కూడా అలానే పత్తిని సేకరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్ల కోసం గతేడాది 110 సెంటర్లు ఉన్నాయని.. ఇప్పుడు122 సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనను కోరారని చెప్పుకొచ్చారు. గతంలో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని.. ఇప్పుడు కూడా దుర్వినియోగం అవుతున్నాయని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదని.. రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం నిలవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎంత పత్తి ఉత్పత్తి అయితే అంత కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు స్మార్ట్ ఫోన్స్ లేకుండానే నిధులు వెళ్తున్నాయా అని ప్రశ్నించారు గిరిరాజ్ సింగ్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 నుంచి 2014 వరకు రూ.12, 500 కోట్ల పత్తి కొనుగోళ్లు చేస్తే.. ప్రస్తుతం రూ.73,000 కోట్ల పత్తి కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు కేవలం తెలంగాణ నుంచే జరిగాయని వెల్లడించారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. 2014లో క్వింటా పత్తి ధర రూ.3,700లు ఉంటే.. ఇప్పుడు క్వింటా రూ.7,710ల ధర ఉందని నొక్కిచెప్పారు. మరో గ్రేడ్ రకం గతంలో క్వింటా రూ. 4 వేలు ఉంటే.. ప్రస్తుతం క్వింటా రూ. 8,110లుగా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు మద్దతుగా నిలవాలని సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో ఓ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం క్వాలిటీ సీడ్స్ ఇవ్వాలని గిరిరాజ్ సింగ్ సూచించారు.

## పొన్నం,అడ్లూరి మధ్య వ్యవహారం

ఈ సందర్భంగా జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవంగా ఉంటుందన్నారు. మాదిగలు అంటే మీకు అంత చిన్న చూపా, అని సీరియస్ అయ్యారు. అన్న మాటను సమర్థించుకుని ఇప్పటి వరకు రియాక్ట్ కాకుండా ఉన్నావంటే ఈ విషయం నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను అని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. సహచర మంత్రిని, ఎస్సీ సామాజిక వర్గం నేతను ఆ మాట అంటుంటే చూస్తూ ఉంటావా అని మంత్రి వివేక్ వెంకటస్వామిని మంత్రి లక్ష్మణ్ కుమార్ నిలదీశారు. ఇక, మంత్రి పొన్నం ప్రభాకర్- అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎపిసోడ్ పై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ రంగ ప్రవేశం చేశారు. ఇద్దరు మంత్రులకు ఫోన్ చేసి ఇరువురు సంయమనం పాటించాలని చెప్పినట్లు సమాచారం. అడ్లూరినీ ఉద్దేశించి పొన్నం కామెంట్స్ చేశారని ప్రచారం.. అడ్లూరిని ఉద్దేశించి మాట్లాడలేదని పొన్నం వివరణ ఇచ్చారు. పొన్నం కామెంట్స్‌ని తప్పు పట్టిన మంత్రి శ్రీధర్ బాబు.. పార్టీకి, ప్రభుత్వానికి ఇది మంచిది కాదంటూ శ్రీధర్ బాబు హితవు పలికారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మనస్పర్థలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. ఈ మేరకు మీడియం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మహేష్ గౌడ్ ఫోన్ చేశారు. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని మహేష్ గౌడ్ సూచించారు. పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడటం తనకురాదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంత్రి వివేక్ లాగా తన దగ్గర డబ్బులు లేవని స్పష్టం చేశారు. తాను మంత్రి కావడం, ఆ సామాజిక వర్గంలో పుట్టడం తన తప్పా.. అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సోనియా, రాహుల్, ఖర్గే, మీనాక్షిని కలుస్తానని వివరించారు. తాను కుర్చీలో కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నారని చెప్పారు. తాను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను ఆదిలాబాద్ పర్యటనలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నేను మంత్రి కావడం.. మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. అయితే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యం అని అన్నారు.

## పత్తి రైతులకు అండగా ఉంటాం

పంటని అమ్మడానికి 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని.. ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్‌రెడ్డి. పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జోలి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశర చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు కిషన్‌రెడ్డి. రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన తీసుకురావాలని కోరారు. అందరూ ఒకేసారి పత్తిని జిన్నింగ్ మిల్స్‌కి తీసుకురావడంతో పంట కొనుగోలు చేయడంలో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగానే పత్తిని ఏరోజు తీసుకువస్తారనేది రిజిస్టర్ చేసుకుంటే సమస్య ఉండదని చెప్పుకొచ్చారు. సీసీఐ నుంచి నేరుగా రైతుల ఖాతాకు డబ్బు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కాటన్ రేటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులని పత్తిలో తేమ తగ్గించేందుకు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయాలని సూచించారు. మహారాష్ట్ర అకోలాలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ ద్వారా ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

# ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా మెడికల్ కాలేజీలు

కనీసం ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాలు సేకరిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గ సమన్వయ కర్త ప్రతిరోజూ రెండు గ్రామాలను సందర్శిస్తాడని, అలాగే నియోజకవర్గాల్లో రౌండ్ టేబుల్స్ ద్వారా చైతన్యపరిచే కార్యక్రమాలు ఉంటాయని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కీలక విషయాలపై మాట్లాడారు. 'అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారికి డిమాండ్ పత్రాలను సమర్పించాలి. జిల్లా కేంద్రాల్లో నవంబర్ 12న ర్యాలీలు జరుగుతాయి. ఒక జిల్లాలో నేను కూడా పాల్గొంటాను. నవంబర్ 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి సేకరించిన సంతకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటాయి. నవంబర్ 24న సేకరించిన సంతకాలతో కూడిన వాహనాలను జిల్లా కేంద్రంలో జెండా ఊపి విజయవాడకు తరలిస్తారు. సేకరించిన ఈ సంతకాలు గవర్నర్ గారికి అప్పగించే కార్యక్రమం తదుపరి జరుగుతుంది' అని వైఎస్ జగన్ తెలిపారు. 'ప్రభుత్వ స్కూళ్లలో ఐదు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. మన హయాంలో నో వేకెన్సీ బోర్డులు చూశాం. ఎరువుల కోసం రైతులు రో÷-డడెక్కడం ఇప్పుడు చూస్తున్నాం. మన హయాంలో ఐదేళ్లలో ఎప్పుడూ అలాంటివి లేవు. ఎరువుల పంపిణీలో కూడా స్కాం చేశారు. దళారీలతో చేతులు కలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పేదలను ఇంకా అన్యాయం చేస్తున్నారు. వారిని మరింత పేదరికంలోని నెడుతున్నారు' అని మాజీ సీఎం మండిపడ్డారు. 'భవిష్యత్తులో కూడా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందనీయకుండా చేస్తున్నారు. మనం కొత్తగా పెట్టిన కాలేజీలను ఇప్పుడు తన బినామీలకు, మనుషులకు తెగనమ్ముతున్నాడు. మనం వచ్చేంత వరకూ రాష్ట్రంలో ఉన్నవి 12 గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు మాత్రమే. మనం ఒక విజన్‌ను ఆవిష్కరించాం. ప్రతి జిల్లాల్లో గవర్నమెంటు కాలేజీ ఉండాలన్న సంకల్పంతో 17 మెడికల్ కాలేజీలు పెట్టాం. ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు ఎందుకు నడుపుతుంది. అలా చేయకపోతే ప్రైవేటు వాళ్లు ప్రజలను దోచుకుంటారు. ఇవి నడపకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయాన్ని ప్రజలకు బాగా అర్థమయ్యేలా చెప్పాలి.

## కొమురం భీమ్
## ఆశయసాధనకు కృషి

ఆయన ఆశయాల కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఐటీడీఏ ఏర్పాటులోనూ కొమరం భీం స్ఫూర్తి ఉందన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఆ మహనీయుడు విగ్రహానికి మంత్రి సీతక్క పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొమరం భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని.. దానికి అనుగుణంగా ప్రత్యేక జీవో ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ మహానాయకుడి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కొమరం భీం పోరాటం.. ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటమని చెప్పుకొచ్చారు. మా గుడాల్లో మా రాజ్యం కావాలని మా అడవుల మీద మాకు హక్కు ఉండాలని పోరాటం చేశారని గుర్తు చేశారు. వారి పోరాటాల ఫలితంగానే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, తొలి ప్రధాని నెహ్రూ ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగంలో ప్రత్యేక రక్షణలు కల్పించారని తెలిపారు. కొమరం భీం స్ఫూర్తితో గిరిజన మంత్రిత్వ శాఖ ఏర్పాటు అయ్యిందని వెల్లడించారు. రాజ్యాంగంలో ఈశాన్య రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించారన్నారు. మైదాన ప్రాంత రాష్ట్రాల్లోని ఆదివాసీల పరిరక్షణ కోసం షెడ్యూల్ 5ను రాజ్యాంగంలో చేర్చారని చెప్పారు.

## న్డీఎస్ఏ నివేదిక ప్రకారమే
## కాళేశ్వరం మరమ్మత్తులు

రూపొందించేందుకు జాతీయ నైపుణ్య సంస్థల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం అని అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పారదర్శకంగా మరమ్మతులు చేపడతాం అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి విషయంలో రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కాలువల విషయంలో ఈనెల 22 లోపు నిర్ణయం తీసుకుంటామన్నారు. మైలారం ద్వారా సుందిళ్లకు ఒక కాలువ ప్రతిపాదన, నేరుగా ఎల్లంపల్లికి నీటి తరలింపు ఇంకో ప్రతిపాదన ఉంది. వ్యయం, హైడ్రాలిక్, ఇంధనం, అన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. రెండు ప్రతిపాదనలపై ఇంజినీర్లు 2 వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కోరాం. 2027 డిసెంబర్ నాటికి ఎస్-ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయాలన్నది మా లక్ష్యం. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. డిండి ఎత్తిపోతలపై అధికారులు 3 రోజుల్లోగా నివేదిక అందించాలి' అని ఉత్తమ్ అన్నారు.

## ఆర్టీసీ ఛార్జీల పెంపు దారుణం

నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ప్రభుత్వం చార్జీలు పెంచడం అన్యాయం అని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందని, కానీ అదే సమయంలో పురుషులు, విద్యార్థులపై అదనపు భారాన్ని మోపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ఇంట్లో ఒక మహిళ ఉచితంగా ప్రయాణం చేస్తే, కుటుంబంలోని మిగిలిన సభ్యులందరికీ రెండింతలు చార్జీలు కట్టాల్సి వస్తోంది. దీంతో ఒక కుటుంబానికి నెలకు కనీసం ఇరవై రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. ఈ విషయం ఇప్పుడు ప్రతి తెలంగాణ కుటుంబానికీ అర్థమైందని ఆయన అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పథకం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించినట్టు ప్రభుత్వం చెబుతుందేమో కానీ, వాస్తవానికి ఇది ఆర్థిక సమతుల్యతను దెబ్బతీసే నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ ఇప్పటికే ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో ఈ విధంగా వసూళ్లను పెంచడం ప్రజలపై నేరుగా భారం మోపడం అవుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీని బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉన్నా, అది ప్రజల వెన్నుపైన భారం మోపడం ద్వారా సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆర్థిక లోటును పూడ్చుకునేందుకు ప్రయాణికులను బలితీసుకుంటోం దని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం మానేసి, ప్రచారపరమైన పథకాల పేరుతో బడ్జెట్ నష్టాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రజలతో మోసం చేయడమేనని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కూడా ఈ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, చార్జీల పెంపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల జీవన వ్యయాలు ఇప్పటికే పెరిగిపోయాయని, ఇలాంటి చర్యలు సాధారణ కుటుంబాలపై మరింత భారం మోపుతాయని వారు పేర్కొన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలతో ఆర్టీసీ చార్జీల పెంపు అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చావిషయంగా మారింది.

## బాలరాజును పరామర్శించిన నవతెలంగాణ స్టేట్ బ్యూరో బసవ పున్నయ్య.



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 07**

ఇటీవల అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మండల కేంద్రానికి చెందిన సిపిఐ(ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు, గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భావండ్ల పల్లి బాలరాజు ను మంగళవారం స్థానిక నవ తెలంగాణ రిపోర్టర్ బూరుగు వెంకటేష్ తో కలిసి నవతెలంగాణ దినపత్రిక స్టేట్ బ్యూరో బుడిగే బసవపున్నయ్య పరామర్శించారు. ఆరోగ్య వివరాలను, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పలకరించి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులు భావండ్ల పల్లి సత్యనారాయణ, గాదే నరేందర్, ప్రవీణ్, రాసాల రమేష్, కుందూరు వెంకటేశ్వర్లు, అప్పాజీ, వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రధాన న్యాయమూర్తి పై దాడి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి మచ్చ

**- డా. రేఖ బోయలపల్లి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**



సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ గారిపై చెప్పులు విసరడం వంటి ఘోర సంఘటనను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు,భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య పునాదులపై జరిగిన అవమానం. జస్టిస్ గవాయ్ ధైర్యంగా, నిష్పక్షపాతంగా అనేక కీలక తీర్పులు ఇచ్చిన గౌరవనీయ న్యాయమూర్తి. అయితే కొంతమంది అసహనశీలులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ, ఆయనను "హిందూ వ్యతిరేకి"గా ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది పూర్తిగా అసత్యం, దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. భారత ప్రధాన న్యాయమూర్తి ఎవరి మతానికీ, కులానికీ చెందరు ఆయన రాజ్యాంగానికి ప్రతినిధి. న్యాయం చేయడం ఆయన ధర్మం, సత్యం, నిష్పక్షపాతం ఆయన మతం. సనాతన ధర్మం పేరుతో న్యాయమూర్తిని అవమానించడం సనాతన ధర్మం కాదు. సనాతన ధర్మం అంటే గౌరవం, నియమం, సత్యం .. ద్వేషం,హింస కాదు.. జస్టిస్ గవాయ్ గారి సేవలు భారత న్యాయవ్యవస్థకు అపారమైనవి. వారి కృషిని దేశం గౌరవించాలి, కాకుండా అవమానించకూడదు. ఈ దారుణ ఘటనకు పాల్పడిన వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ప్రభుత్వాన్ని బలంగా కోరుతున్నాను. ఇలాంటి ద్వేషపూరిత చర్యల వల్ల న్యాయవ్యవస్థ అవమానమవుతోంది, హిందూధర్మం పేరు మసకబారుతోంది, దేశంలో మత సామరస్యం దెబ్బతింటోంది. ప్రధాన న్యాయమూర్తి పై దాడి అంటే భారత న్యాయవ్యవస్థపైనే దాడి. ప్రతి పౌరుడు రాజ్యాంగ గౌరవాన్ని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడే బాధ్యతతో ముందుకు వచ్చి ఈ సంఘటనను ఖండించాలి.

## ఖర్గేను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**బెంగళూరు వెలుతురు అక్టోబర్ 07:**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం బెంగళూరులో పరామర్శించారు. ఇటీవల పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని, పూర్తి ఉత్సాహంతో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి ఆయన మార్గదర్శకత్వం అత్యంత అవసరమన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ను పరామర్శించిన మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు

**బెంగళూరు వెలుతురు అక్టోబర్ 07:**



ఇటీవల అనారోగ్యానికి గురై పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్స చేయించుకుని, ప్రస్తుతం బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఖర్గే గారు త్వరగా పూర్తిగా కోలుకుని, తిరిగి ప్రజా జీవితంలో క్రియాశీలకంగా పాల్గొనాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు.

# పంచాయితీ రాజ్ హ్యామ్ ప్రాజెక్టు పై నీలి నీడలు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**



హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో పంచాయితీ రాజ్ లో ఇప్పటి వరకు టెండర్లు పిలవకపోవడంతో ప్రాజెక్టు పై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈఎన్సీ గా జోగా రెడ్డి బాధ్యతలు తీసుకున్న పరిస్థితి మరింత గందర గోళంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అశోక్ ఈఎన్సీ గా ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టు ను పట్టించుకున్న పాపాన పోలేదు. కేవలం రెండు నెలలు ఇంజనీర్ ఇన్ చీఫ్ గా ప్రోటోకాల్ అనుభవించి రిటైర్డ్ అయ్యారన్న విమర్శలు ఉన్నాయి. డిపార్ట్మెంట్ లో ఏ ఒక్క సమస్యను సీరియస్ గా తీసుకోని పరిష్కారం చూపలేదని సొంత డిపార్ట్మెంట్ ఉద్యోగులు చెప్తున్నారు. తాజాగా హ్యామ్ ప్రాజెక్టు పై సమావేశం ఏర్పాటు చేసి టెండర్లు ఆహ్వానించాలని త్వరితగతిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సీఎస్ రామకృష్ణ రావు ఇంజినర్ల మీద తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఓ ఈఎన్సీ ఉండగా హ్యాం ప్రాజెక్టు పై రెగ్యులర్ రివ్యూలు ఉండేవి. ప్రాజెక్టు త్వరిత గతిన పూర్తీ చేయాలన్న ఉద్దేశ్యం తో మంత్రి , అధికారులు , ఇంజనీర్ల తో విడతల వారీగా సమీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదంటున్నారు పంచాయితీ రాజ్ ఉద్యోగులు. డిపార్టుమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వైఖరే వేరు అన్న చందంగా ఉందంటున్నారు సిబ్బంది. డిపార్ట్మెంట్ పరిధిలో జరిగే ఏ సమస్యని కూడా సీరియస్ గా తీసుకోరన్న విమర్శలు ఉన్నాయి. సామాన్య జనం నుండి ఇంజనీర్ల వరకు సెక్రెటరి కలిసే పరిస్థితి లేదు. శాఖ మంత్రి ఇందుకు మినహాయింపు కాదన్నా ఆరోపణలు ఉన్నాయి. రెండేళ్లలో పుర్తి స్థాయిలో శాఖలో ఒక్కసారి సమీక్ష చేసిన దాఖలాలు లేవన్న విమర్శలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ముందు డిపార్ట్మెంట్ తీరు ద్వారా గ్రామీణ స్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకత ఎదురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. అత్యంత పెద్ద డిపార్ట్మెంట్ అయిన గ్రామీణాభివృద్ధి శాఖలో జరుగుతున్న ఇబ్బందులపై ముఖ్య మంత్రి దృష్టి పెడితే లోకల్ బాడీస్ లో కలిసి వస్తోందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. అసలు పని పక్కన పెట్టి సంబంధిత పిఆర్ ఈఎన్సీ ముఖ్యమంత్రి తనకు ఈఎన్సీ పదవీకాలం పొడిగించేలా హామీ ఇచ్చారంటూ డిపార్టుమెంట్ లో జోరుగా ప్రచారం చేయించు కుంటున్నారట.

# జోడేఘాట్‌లో ఘనంగా కుమ్రం భీం వర్ధంతి

## నివాళులర్పించిన మంత్రులు జూపల్లి, అడ్లూరి లక్ష్మణ్







**కెరమెరి మండలం వెలుతురు అక్టోబర్ 07:**

జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీం పోరాట స్ఫూర్తి తెలంగాణకే కాదు యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ లో ఆదివాసీల ఆరాధ్యదైవం కుమ్రం భీం 85వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కుమ్రం భీం విగ్రహానికి సంప్రదాయబద్ధంగా నివాళులర్పించారు. సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి పూజలు చేశారు. భీం స్మృతి చిహ్నం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ఆదివాసీల ఆశాజ్యోతి కుమ్రం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని, ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం.. బానిసత్వపు సంకెళ్లు తెంచడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని, స్వయంపాలన



ఉద్యమానికి పితామహుడిగా నిలిచిన కుమ్రం భీం చరిత్ర భావితరాలకు ఆదర్శనీయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కుమ్రం భీం మనువడు సోనేరావు, ఆదివాసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరి అధికారిక నివాసంలో భేటీ అయిన తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల సమావేశం

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో వేసిన పిటిషన్ పై చర్చ

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**

మంత్రి వాకిటి శ్రీహరి అధికారిక నివాసంలో ప్రారంభం అయిన తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల సమావేశంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె కేశవ రావు, ఎంపీలు సురేష్ షెట్కర్, అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వి హనుమంతరావు, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, రాజ్ ఠాకూర్, హైదరాబాద్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర బీసీ నేతలు నేడు హైకోర్టులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో వేసిన పిటిషన్ పై వాదనలు ఉండడంతో ప్రభుత్వం నుండి హైకోర్టులో బలమైన వాదనలు వినిపించేలా సమావేశం.





హైకోర్టులో బీసీ రిజర్వేషన్లపై విచారణ కు సంబంధించి కీలక సూచనలు చేసిన రాష్ట్ర మంత్రి కొండ సురేఖ తెలంగాణ కాంగ్రెస్ బిసి నేతల సమావేశంలో సుదీర్ఘంగా తన వ్యూహాన్ని వివరించిన మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన దిశానిర్దేశం ప్రకారం నడుచుకోవడంపై బిసి నాయకుల సమావేశంలో తన ఆలోచనలను పంచుకున్న కొండా సురేఖ ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన కొండా సురేఖ

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**

## నవీన్ యాదవ్ వైపే మొగ్గు

**- అధిష్టానానికి పేరు సిఫార్సు**

**- పోటీ నుంచి తప్పకున్న బొంతు**

**హైదరాబాద్,అక్టోబరు7 ( వెలుతురు):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ కి లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో నవీన్ యాదవ్ వైపు సీఎం రేవంత్ రెడ్డి మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో నుంచి తప్పుకున్నట్లు బొంతు రామ్మోహన్ ప్రకటించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయిస్తుందని బొంతు రామ్మోహన్ తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తాను పనిచేస్తానని బొంతు రామ్మోహన్ ప్రకటించారు. మరోవైపు.. జూమ్ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీలు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చేసిన సర్వే రిపోర్టులు , అభ్యర్థుల సామాజిక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అయితే, రెండు పేర్లతో ఏఐసీసీకి సిఫారసు చేయాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు.

# సంపాదకీయం.. న్యాయమూర్తులపై పని ఒత్తిడి !

మనదేశ జనాభాకు తగ్గట్లుగా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన తక్షణ అసవరం ఉంది. ఇప్పటికే కేసుల సంఖ్యపెరుగుతోంది. ఒక్కో కేసుకు దశాబ్దాల సమయం పడుతోంది. న్యాయమూర్తులపై ఒత్తిడి పెరుగుతోంది. రోజువారీ కేసులకే సమయం సరిపోవడం లేదు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో సుప్రీంకోర్టుకు 34 మంది న్యాయమూర్తులు సరిపోతారా.. అనేది కీలక ప్రశ్న. ఇక హైకోర్టుల్లో 63 లక్షలకుపైగా, దిగువ కోర్టుల్లో దాదాపు ఐదు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ కేసులు కొండలా పేరుకుపోవడం ఆందోళనకరం. అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే ఎన్నడూలేనంత అత్యధికంగా 88,417 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయం ఆలస్యం కావడమంటే న్యాయం జరగకపోవడమే అనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎందుకంటే అండర్ ట్రయల్ ఖైదీలు కేసులు తెమలక ఏళ్లుగా జైళ్లల్లో మగ్గుతున్నారు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కినా ఏళ్లతరబడి కేసులు తెమలడం లేదు. రాజకీయ కేసులు తప్ప క్రిమినల్ తదితర కేసులు తేల్చడం లేదు. ఈ క్రమంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలి. సుప్రీం కోర్టు బెంచ్‌లను పెంచాల్సిన అవసరాన్ని గుర్తించాలి.కోర్టుల్లో తగినంతమంది న్యాయమూర్తులను, సిబ్బందిని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. లోక్ అదాలత్‌లు లాంటివి నిర్వహించి ఇరుపక్షాలు అంగీకరించిన కేసులను పరిష్కరిస్తే కోర్టులపై ఒత్తిడి తగ్గుతుంది. తీర్పులకు సమయం నిర్దేశిరచాలనే వాదన కూడా వుంది. న్యాయస్థానాలకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన



కేంద్రం అనేక సందర్భాల్లో అడ్డుపడటం, అడ్డగోలుగా విమర్శలు చేయడం పరిపాటిగా వుంది. న్యాయమూర్తుల నియామకానికి ప్రత్యేకంగా ఒక జ్యుడీషియల్ కమిషన్ ఉండాలన్న చర్చ చాలాకాలంగా వుంది. అయితే నేడు కొలీజియం వ్యవస్థ ఆ బాధ్యత నిర్వహిస్తోంది. కాని కేందప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం నియామకాలను తీవ్రంగా జాప్యం చేస్తోంది. ఏవో సాకులు చూపి తిరస్కరిస్తోంది. ఇంకొన్ని సందర్భాల్లో కొలీజియం, కేంద్ర న్యాయశాఖ మధ్య వివాదాస్పదం అవుతున్నవే వున్నాయి. భారత రాజ్యాంగం, పాలన, శాసన, న్యాయ వ్యవస్థల మధ్య స్పష్టమైన లక్ష్మణరేఖలను నిర్దేశించింది. పాలకులు వాటిని ఉల్లంఘించిన సందర్భాల్లోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. నాగరిక సమాజంలో సత్వర న్యాయం అందించడం వ్యవస్థ బాధ్యత. అందుకోసం సుప్రీంకోర్టు తీసుకుంటున్న చొరవకు కేంద్రం వీలైనంత తోడ్పాటు నందించాలి. అప్పుడే పెండింగ్‌కు అడ్డుకట్టపడటంతోపాటు సత్వర న్యాయం అందేందుకు అవకాశముంటుంది. ఎందుకంటే ఇటీవల హైదరాబాద్ జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ కేసులో దాదాపు 17 ఏళ్ల నిరీక్షణ తరవాత పరస్పర విరుద్ద తీర్పులు వచ్చాయి. జస్టిస్ ఎన్‌వి రమణ ఇచ్చిన తీర్పుకు భిన్నంగా మళ్లీ తదుపరి సిజెఐ తీర్పు వచ్చింది. దీనిపై అప్పీల్‌కు వెళితే కేసును కొట్టివేశారు. ఇది సమాజంలో ఓ పేదవర్గాల కోసం ప్రభుత్వం అనుసరించి గృహ సంబంధ విషయం. దీంతో జర్నలిస్టులు రోడ్డున పడ్డారు. ఇందులోని మెరిట్స్‌ను గుర్తించక పోవడంతో జర్నలిస్టులు ఆందోళనకు కారణమయ్యింది. కేసులో ప్రభుత్వం కూడా గట్టిగా వాదనలు ఇవ్వలేకపోయింది. జర్నలిస్టులకు 17 ఏళ్ల క్రితం ఎందుకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి వచ్చిందో ధర్మాసనం ముందుంచ లేపోయింది. కేసు వేసిన వారు సైతం జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను తెలుసు కోకుండా కోర్టుకు వెళ్లారు. ఇదంతా ఎందుకుంటే కేసు ఏదాదిలోనే తేలివుంటే సమస్య వచ్చేది కాదు. అప్పుడే ప్రభుత్వాలు తగిని నిర్నయాలు తీసుకునే వీలుండేది. కేవలం కోర్టుల్లో దశాబ్దన్నరం కాలంగా నలిగిపోచి చివరకు అన్యాయం జరగడంతో తమ సమస్యలపై నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం లోపం కూడా ఉంది. అందుకే కేసులు సత్వరంగా పరిష్కారం కావాలంటే న్యాయమూర్తుల సంఖ్యను ఇప్పుడున్న దానికి కనీసం పదివంతులు పెంచాలి. అప్పుడు త్వరగా పరిష్కారం దక్కుతుంది. జైళ్లలో మగ్గుతున్న ఎందరికో ఊరట కలుగుతుంది. లేకుంటే కేసులు తేలకుండానే ట్రయల్ ఖైదీలు జైళ్లల్లో మగ్గాల్సి వస్తోంది. జాతీయ జ్యుడీషియల్ గ్రిడ్ ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం 69,605 సివిల్, 18,887 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2020 వేసవి సెలవుల సమయంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రస్తుత సిజెఐ బిఆర్ గవారు వేసవి సెలవుల్లోనూ పాక్షికంగా పనిచేసే పద్ధతిని తీసుకొచ్చారు. కొల్‌కతా, మహారాష్ట్ర హైకోర్టుల్లో కేసుల పెండింగ్ అత్యధికంగా ఉంది. జనాభాతో పోల్చితే న్యాయమూర్తుల నిష్పత్తి ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే మనదేశంలోనే అత్యంత తక్కువగా ఉండటం కేసుల పెండింగ్‌కు కారణమవుతోందన్న వాదన ఉంది. . అమెరికాలాంటి దేశాల్లో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 150 మంది వరకూ న్యాయమూర్తులుండగా, మన దేశంలో 21 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. కోర్టుల్లో కేసులు భారీగా పెరిగిపోవడానికి అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ కేసులతో న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దేశంలో కార్పొరేట్, అవినీతి, నేరగ్రస్థ రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. చట్టసభల సభ్యుల్లో 45 శాతం మందికిపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాధాన్యతా క్రమంలో చట్ట సభల సభ్యులు, అధికారులపై కేసులను పరిష్కరించడం కూడా అత్యవసరం. ఇక ఇతర కారణాల విషయానికి వస్తే న్యాయవాదులు తరచూ వాయిదాలు కోరడం, స్థానికంగా పరిష్కరించదగినవి కూడా కోర్టులకు తీసుకురావడం తదితర కారణాల వల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగిపోతున్నాయి. రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలు సివిల్ కేసుల విషయంలో వినియోగించుకుని సుదీర్ఘకాలంగా వాయిదాలున్న కేసుల సంగతి తేల్చాలనే సూచన ఉంది. ఏదేమయినా ఈ విషయంలో కేంద్రం ఇక ఎంతమాత్రం ఉపేక్షించకుండా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచి , కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రయత్నం చేయాల్సి ఉంది.

## 60కోట్ల మోసం కేసులో విచారణ

**- ముంబై పోలీస్ విచారణకు శిల్పాశెట్టి**

**ముంబై,అక్టోబర్7( వెలుతురు):**



ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా శిల్పాశెట్టిని ముంబయి పోలీసులు విచారించారు. 4 గంటల పాటు విచారించిన పోలీసులు ఆమె బ్యాంక్ స్టేట్‌మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి.ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాను కూడా ఇటీవల పోలీసులు విచారించారు. కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు ఆ సమయంలో ఆయన వెల్లడించారు. దీంతో ఈ నిధుల్ని నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనే దానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోభాగంగా శిల్పాను విచారించినట్లు తెలుస్తోంది. ఇక శిల్పా దంపతులు ఇటీవల థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు దాన్ని తిరస్కరించింది. ఈ కేసు విషయంలో స్పష్టత వచ్చేవరకూ విదేశాలకు వెళ్లడానికి వీల్లేదని పేర్కొంది.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌కు భారీ షాక్

**- కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు**

**- ఓటరు కార్డులు పంచడంపై కేసు నమోదు**





**హైదరాబాద్,అక్టోబర్7( వెలుతురు):**

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అయ్యింది. మధురా నగర్ పోలీస్ స్టేషన్‌లో జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి నవీన్ యాదవ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నవీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నవీన్ యాదవ్ ఓటర్ కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి చర్యగా భావించిన ఎన్నికల సంఘం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నవీన్ యాదవ్ మీద బీఎన్ఎస్ 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు అయ్యింది. ఎన్నికల సంఘం నిబంధనల ఉల్లంఘనల మీద అధికారుల సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అవ్వడం కాంగ్రెస్‌కు భారీ దెబ్బగా చెప్పుకోవచ్చు. నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా అనుకున్నట్లు రాజకీయా వర్గాల్లో వార్తలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో నవీన్ యాదవ్‌పై కేసు నమోదు అవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే తాజాగా.. ఎన్నికల సంఘంకు ఎంపీ రఘునందన్ రావు, నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులు అందజేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన ఎన్నికల సంఘం.. నవీన్ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## దేశం నివ్వెర పోయే ఘటన

**- చీఫ్ జస్టిస్‌పై దాడి అత్యంత హేయం**

**న్యూఢిల్లీ,అక్టోబర్7( వెలుతురు):**





దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై మదం తలకెక్కించుకున్న ఓ న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన ఘటన అత్యంత హేయమైన చర్యగా చూడాలి. ఇది మాటలకు అందని ఆందోళనకర ఘటనగా చూడాలి. సుప్రీం కోర్టులో ఓ న్యాయవాది ఎంత మదమెక్కిన వాడు అయితే తప్ప ఇలాంటి ఉన్మాద చర్యకు పాల్పడడు. ఈ ఘటన దేశం యావత్తూ ఆందోళనకు గురిచేసింది. ప్రధాన న్యమూర్తిపైనే దాడికి తెగబడడం క్షమించరాని నేరం. సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకుగొంకూ లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించక పోయివుంటే..దాడి జరిగి ఉండేది. ఈ హఠాత్పరిణామం తెలిసిన దేశ ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కోర్టులో తీవ్ర గందరగోళం నెలకొనగా, ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని జస్టిస్ గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని, మన జ్యుడీషియరీ ధృఢత్వాన్ని ఇనుమడింపజేసింది. జస్టిస్ గవాయ్ పై దాడి ఉదంతంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాల్సిందే. స్టిస్ గవాయ్ పై దాడి సాదాసీదా యాదృచ్చికంగా చోటు చేసుకున్నది కాదు. జస్టిస్ గవాయ్ పై దాడి రాజ్యాంగానికి, ప్రజలకు అవమానం. గవాయ్ పై దాడిని తరతమ భేదం లేకుండా పార్టీలు, సంస్థలు, వ్యక్తులు నిరసిస్తున్నారు. చీఫ్ జస్టిస్ బాధ్యతలు స్వీకరించాక మే నెలలో తొలిసారి స్వంత రాష్ట్రం ముంబరు పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడి బిజెపి ప్రభుత్వం కనీస ప్రొటోకాల్ పాటించకుండా ఘోరంగా అవమానపర్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ముంబరు పోలీస్ కమిషనర్ వంటి ముఖ్య అధికారులు గవారు పర్యటనకు ఉద్దేశపూర్వకంగా డుమ్మాకొట్టారు. అనంతరం పొరపాటు జరిగిందని మహారాష్ట్ర సర్కార్ సుప్రీం కోర్టు ముందు తప్పు ఒప్పుకొని విచారం వ్యక్తం చేయాల్సి వచ్చింది. కర్తవ్య కార్యాచరణెళి వైవిధ్యభరిత భారతావనికి, రాజ్యాంగానికి తిరుగులేని రక్షణ కవచం. జస్టిస్ గవాయ్ చిత్తశుద్ధి, ఆయన ధృడచిత్తం అభినందనీయం. అయితే ఈ దాడికి కారణమైన శక్తులు ఎంతటి వారైనా శిక్షించాల్సిందే.

## బంగారం ధరలు మరింత ప్రియం

**- మళ్లీ పెరిగిన పదిగ్రాములు ధర**

**హైదరాబాద్,అక్టోబర్7( వెలుతురు):**



బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లేదు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. క్రమంగా రోజురోజుకు పెరుగుతూ లక్షన్నరకు చేరువగా పరుగులు తీస్తోంది. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,23,850కి చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,11,500గా ఉంది. వెండి కిలో రూ.1,54,350కి చేరింది. సోమవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,23,460 ఉండగా.. మంగళవారం మరో రూ.390 పెరిగింది. కిలో వెండి ధర రూ.1,54,200 ఉండగా.. తాజాగా మరో రూ.150 పెరిగి రూ.1,54,350కి చేరింది. అమెరికా షట్‌డౌన్ కొనసాగడం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను ఈ ఏడాదిలో మరింత తగ్గిస్తుందనే అంచనాల నేపథ్యంలో ఇన్వెస్టర్ల తమ నిధులను బంగారం, వెండిపైకి మళ్లించడం ఈ పరిస్థితికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. పండగల సీజన్ కావడం, అంతర్జాతీయంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. వెండి కిలో రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని ఇటీవల మార్కెట్ పండితులు అంచనా వేసిన సంగతి తెలిసిందే.

## రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసు

**- తెలుగు రాష్ట్రాల్లో ఐటి సోదాలు**

**హైదరాబాద్,అక్టోబర్7( వెలుతురు):**

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణలోని 25 చోట్ల అధికారులు తనిఖీలు చేపట్టారు. రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసులో హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఏపీలో గత ప్రభుత్వ హయాంలో పలు ట్రేడింగ్ కంపెనీలు భారీగా నగదు లావాదేవీలు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు.

2024 ఎన్నికల సమయంలోనూ భారీగా నగదు విత్‌డ్రా చేసినట్లు ఐటీ శాఖ గుర్తించింది. పలు ట్రేడింగ్ కంపెనీలు పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతులు పొంది పప్పు దినుసులు సరఫరా చేయకపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ విశాఖపట్నంలో హిందుస్థాన్ ట్రేడర్స్, కర్నూలుల వీకేర్ గ్రూప్‌లో సోదాలు జరిగాయి.

## చెవిరెడ్డి మొహిత్ రెడ్డికి షాక్

**- మద్యం కేసులో ముందస్తు బెయిల్ నిరాకరణ**

**అమరావతి, అక్టోబర్7 ( వెలుతురు):**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసింది. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టను ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

## నాంపల్లిలో 2.5 కేజీల గంజాయి స్వాధీనం

**- నలుగురిపై కేసు నమోదు, ఒకరు అరెస్ట్**



**బషీర్ బాగ్ వెలుతురు 7 అక్టోబర్ :**

నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని ఎస్ టి ఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి సమాచారం మేరకు ఎస్టిఎఫ్ ఏ టీం లీడర్ సిబ్బంది దాడులు నిర్వహించారు. తనిఖీల్లో 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు టు వీలర్ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని హట్ గోడ సంజయ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. 2.5 కేజీలకంజాయి స్వాధీనం. ఈ కేసులో సంజయ్ తో పాటు శేఖర్ బాబు, కామ్రే బాబు, గంగోలి బహు అనే ముగ్గురు పై కూడా కేసు నమోదు చేశారు. వీరు పరార్ లో ఉన్నట్లు అంజిరెడ్డి తెలిపారు. నిందితుడిని గంజాయిని నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు అయన తెలిపారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై జరిగిన దాడిని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తుంది

**- ప్రజాస్వామ్యంలో ఇలాంటివి జరగడం దురదృష్టకరం**

**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బి.ఆర్ గవాయ్ పైన న్యాయవాది రాకేశ్ కిశోర్ బూటు తో దాడి చేయాలని ప్రయత్నించడాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇది హేయమైన చర్య అని అన్నారు. సోమవారం ఉదయం కేసు విచారణ సమయంలో డయాస్ వద్దకు వెళ్లిన న్యాయవాది రాకేష్ కిషోర్ ఒక్కసారిగా తన స్పోర్ట్స్ షూ తీసి, సిజెఐపైకి విసిరే ప్రయత్నం చేయడం రాజ్యాంగ వ్యవస్థకు అవమానకరమన్నారు. భారత చరిత్రలో ఇది చీకటి రోజు అని అన్నారు. ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి జరిగితే సాధారణ ప్రజలకు ఏమి రక్షణ ఉంటుందని ఇది భారత రాజ్యాంగం పై దాడిగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలు జరగకుండా చూసుకోవాలని దాడికి పాల్పడిన వ్యక్తి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ఆలోచన విధానాలతో స్వతంత్ర ప్రతిపత్తి కలిగినటువంటి న్యాయవ్యవస్థ పైన న్యాయమూర్తుల పైన దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రజాతంత్ర వాదులు ఈ దాడిని ముక్త కంఠంతో ఖండించాలన్నారు.

## ఇబ్రహీంపట్నం గురుకుల పాఠశాలలో క్రీడలు ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 7:**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల విద్యాపిట్ ఆవరణలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్ అఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరు అయి విద్యార్థుల జట్టులను ఎంపిక చేసి విద్యార్థులతో కరచలనం చేసుకొని విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి జోనల్ స్థాయి కబడ్డీ, వాలిబాల్, ఖోఖో టోర్నమెంట్ మరియు ఎంపికలను ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్ నాథ్ రెడ్డి వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్ గౌడ్, (మామ) ఉప్పరిగూడ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ముత్యాల వెంకటరెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్ రెడ్డి గురుకుల విద్యాపీట్ పాఠశాల ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భక్తి శ్రద్ధలతోఘనంగా భవానీ మాత మహేశ్వరి మాతల పల్లకి సేవ

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక పరిధిలోని హొతికే గ్రామ శివారులో గల సత్వార్ గుండేరావు జామ తోటలో ప్రతిష్ఠిత భవాని మాత మరియు మహేశ్వరి మాత మందిరంలో ప్రతి ఏడాది నిర్వహించే వార్షిక పల్లకి సేవ ఈ సంవత్సరము విశ్వా వసు నామ సంవత్సర పౌర్ణమి రోజున భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ ప్రత్యేక సందర్భంలో ప్రజల భాధా నివారణార్థం మరియు లోక కళ్యాణార్థం కుడంబల్ ఆయి సమక్షంలో ఉదయం మేలుకొలుపు కార్యక్రమంతో ప్రారంభమై, పూజా అభిషేకాలు శ్రీమంత్ పూజారి ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు భవానీ మాత పల్లకి సేవ ఘనంగా సాగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుండి విచ్చేసిన అనేకమంది భక్తులు పాల్గొని పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాల వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా డిఎం పౌరసరఫరాల శాఖ సంగారెడ్డి జిల్లా అధికారి అంబదాస్ రాజేశ్వరరావు, పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్, బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు అరుణ కౌలాస్, అప్పం ప్రభు, సగ్గం శ్రీనివాస్, నరసింహారెడ్డి, మెదక్ సుధాకర్, ముప్పిడి సాయిరాం, బెజగం సత్యనారాయణ, మల్లేశ్, లక్ష్మణ, తాండూరు హరి, శ్రీనివాస్ (హైదరాబాద్), వీర, అప్పం శంకర్, శ్రీధర్ (చేగుంట) తదితరులు పాల్గొని దేవీ సేవలో భాగస్వాములయ్యారు. భక్తుల సమృద్ధి, శాంతి మరియు సద్భావన కలగాలని కోరుతూ ఈ ఆధ్యాత్మిక మహోత్సవం విజయవంతంగా ముగిసింది.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో
# ప్రజాగళం దామెర భూపాల్ టీం

**- ఆరుట్ల గ్రామ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తా**

**- దామెర భూపాల్ ప్రజాగళం**



**మంచాల వెలుతురు అక్టోబర్ 7:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రజాగళం దామెర భూపాల్ మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలో ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న ప్రజలు ఫోన్ చేయగానే తక్షణమే అక్కడికి చేరుకొని అక్కడికి చేరుకొని అక్కడి సమస్యపై ముందుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాను అన్నారు గ్రామ కార్యదర్శి అధికారి స్పందించకుంటే మండల అధికారుల దగ్గరికి వెళ్లి సమస్యలు దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేశాను అన్నారు ఆరుట్ల గ్రామంలో ఎక్కడ వీధిలైట్లు పోయిన డ్రైనేజీ లీకేజీ అయినా ఎక్కడ కరెంట్ స్తంభలు అవసరం ఉన్న వెంటనే అధికారులకు ఫోన్ చేసి దగ్గరుండి పని చేయించి సమస్యలు పరిష్కరించాను అన్నారు నేను సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలపై పోరాటం చేయడం వల్లనే దామెర భూపాల్ ఉన్న నా పేరు ప్రజాగలం భూపాల్ గా మారింది అన్నారు అది ప్రజలు నాకు ఇచ్చిన బిరుదు అన్నారు ఇప్పటికీ ఎక్కడ సమస్య ఉన్న న్యాయం కోసం ఆ సమస్య తీరేవరకు పోరాటం చేస్తాను అని అన్నారు ఆరుట్ల గ్రామంలో ఎంతో మంది రాజకీయ నాయకులు పట్టించుకోలేని సమస్యలు నేను స్వయంగా పట్టించుకోని సమస్యలు పరిష్కారం చేశాను అని అన్నారు అందుకే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నా టీం సభ్యులను సర్పంచ్ ఎంపీటీసీగా ఎన్నికల బరిలోని లబెడతాను అని అన్నారు ఆరుట్ల గ్రామ ప్రజలు ప్రజాగలం టీం సభ్యులను ఆదరించి గెలిపించాలని ప్రజాగళం భూపాల్ అన్నారు

# సుప్రీం కోర్ట్ జస్టిస్ గవయ్ పై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

**- దాడికి యత్నించిన లాయర్ రాకేష్ కిషోర్ ని కఠినంగా శిక్షించాలి**

**- ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్, మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్**



**మంచాల వెలుతురు అక్టోబర్ 7:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జెఐపై గవాయ్ పై దాడి యత్నాన్ని ఖండిస్తూ అఖిలపక్షపార్టీల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు ఈసందర్భంగా ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్ న్యాయవాది మంకు మురళి మాట్లాడుతూ సుప్రీంకోర్టులో గవాయ్ పై దాడి యత్నం అప్రజాస్వామికం భారతదేశంలో మాట్లాడేహక్కు ప్రశ్నించే హక్కు భారతరాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కు సుప్రీంకోర్టులో జడ్జి ఒకదళితుడు అయినందున జీర్ణించుకొని మనువాదులు సిజెఐపై దాడి చేసినారు దీనిని 140కోట్ల మంది భారత ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు మేధావులు ప్రతిఒక్కరు ఖండిచల్సిన అవసరం ఉంది ఇలాంటి దాడులు మళ్ళీజరగ కాకుండా లాయర్ రాకేష్ కిషోర్ ను కఠినంగా శిక్షించి బార్ కౌన్సిల్ నుంచి అతన్ని పర్మినెంట్ గా తొలగించాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో మంచాల మండలం మాజీ కోఆప్షన్ సభ్యులు యూసఫ్అలీ సలాం అనంగల్ల పరమేష్, ప్రజాగళం దామెర భూపాల్, పున్నం రాము, సిపిఎంపార్టీ నాయకులు బడ్డు విజయ్, డిస్ పి నాయకలు కొండిగారి శ్రవణ్, చీమర్ల మహేష్, పంది శేఖర్, జోగు వినోదకుమార్, చీమర్ల శివలింగం రంజిత్, చీమర్ల నర్సింహా చిందం శ్రీశైలం నూకం రాజు వేదిరే రమణరెడ్డి మంకుసురేష్, సాతిరి వెంకటేష్, దామెర శివ మంకు వినోద్, యండిరఫీక్ కొత్తపల్లి శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలి

***అంబర్పేటలోని ఆలీ కేఫ్ చౌరస్తాలో పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నేత లింగంగౌడ్***





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:** బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలని, అలాగే కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు,రెడ్డి జాగృతి నాయకులు కోర్టుకు పోయి రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నాలు చేయడాన్ని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబర్పేట ఆలీ కేఫ్ చౌరస్తాలోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ హైకోర్టులో,సుప్రీంకోర్టులో న్యాయమైన బీసీ రిజర్వేషన్ల వాటాను అడ్డుకోవాలని రిజర్వేషన్లు వ్యతిరేకులు,రెడ్డి జాగృతి నాయకులు చూడడం చాలా సిగ్గుమాలిన విషయం అన్నారు. 60 శాతం ఉన్నటువంటి బీసీలు స్థానిక ఎన్నికలలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు కావడం ఇష్టం లేక పిడికెడు శాతం ఉన్నటువంటి రెడ్డి సామాజిక వర్గానికి చెందినటువంటి మాధవరెడ్డి, గోపాల్ రెడ్డిలు బీసీల నోటికాడి ముద్దను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని, అంతేకాకుండా అసెంబ్లీలో చట్టం చేసిన బీసీ బిల్లును గవర్నర్ ఆమోదించకుండా అలాగే ఉండడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈడిగ శ్రీనివాస్ గౌడ్ మల్లికార్జున యాదవ్ గూడూరు భాస్కర్ అనుగంటి విజయ్ మాదేశి రాజేందర్ మాధవి నాగమణి తదితరులు పాల్గొన్నారు

## సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కే లలిత దేవి

**సరూర్ నగర్ వెలుతురు అక్టోబర్ 07:**





సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కే లలిత దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలనూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి , అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు, ఆసుపత్రిలో డెలివరీ అయిన మహిళలను ప్రత్యక్షంగా కలిసి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ చికిత్స వివరాల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆరోగ్య కేంద్రంలో ఉండే అన్ని రికార్డులు మరియు రిజిస్టర్లను పరిశీలించి నిర్వహణ పద్ధతులు రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యత పై సమీక్ష నిర్వహించారు. విధులలో ఉన్న వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగుల హాజరు మరియు విధినిర్వాహన గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మంచి నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల మనల్ని పొందాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల స్టోర్ సందర్శించి అన్నీ రకాల మందులు అందుబాటులో ఉన్నాయో లేదో గమనించారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సందర్భంగా ఉద్యోగులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారిని డాక్టర్ గీత మరియు స్థానిక వైద్యులు అర్చన మరియు ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

# కనబడుట లేదు



**బొల్లారం వెలుతురు అక్టోబర్ 07:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ కు చెందిన కాశిరెడ్డి నారాయణ రెడ్డి వయస్సు 55 సోమవారం ఉదయం 10:30 నుండి కనిపించడం లేదు. కొద్దిగా మతిస్థిమితం లేదు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిసిన అన్ని చోట్ల వెతికారు ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. ఆయనకి గుర్తు గా ఎడుమ చేతికి కట్టు ఉన్నది. ఈ మేరకు పోలీసు స్టేషన్ లో కనబడుట లేదని పిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కావున ఎవరికైన కనిపిస్తే ఈ క్రింద నెంబర్ కి తెలియచేయగలరు.

9989921149 చిచ్చా

9573588106 రవీందర్ రెడ్డి

8465976918 శివ రెడ్డి తెలపగలరని కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆదివాసుల ఉనికిని కాపాడిన మహనీయుడు కొమరం భీమ్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్



**ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 07:** మంగళవారం కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జల్ జంగల్ జమీన్ నినాదంతో రజాకార్లకు వ్యతిరేకంగా కొమురం భీమ్ పోరాడారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకై బిజెపి కృషి చేస్తుందని పేర్కొన్నారు. నేతలు పాయల్ శరత్, వేదవ్యాస్, ఆకుల ప్రవీణ్, మయూర్, సతీష్, రాకేష్. దయాకర్. రవి. మాడవీ హనుమంతు.. తదితరులు పాల్గొన్నారు



కరీంనగర్ డ్రగ్ కంట్రోల్ ఆఫీస్ లో ఏసీబీ దాడులు, లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కిన అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ తో సహా రాము అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు... ప్రైవేటు ఆసుపత్రి మెడికల్ షాప్ రెన్యువల్ కోసం 20 వేలు డిమాండ్ చేసిన అధికారులు

**కరీంనగర్ జిల్లా వెలుతురు అక్టోబర్ 07:**

## అప్ప తీసుకుని ఎగ్గొట్టిన వ్యాపారి

**ఇంటిపై దాడిచేసి తగులబెట్టిన బాధితులు**

**నల్గొండ,అక్టోబరు7 ( వెలుతురు):** నమ్మిన జనానికి మాయమాటలు చెప్పి వాళ్ల దగ్గర సొమ్ములు అడ్డంగా దోచేసి, తీరా ఇవ్వమంటే, ఏళ్లకేళ్లు తిప్పించుకుంటూ నరకయా తన గురిచేసిన ఓ మాయగాడికి అప్పిచ్చిన వాళ్లంతా కలిసి గుణపాఠం చెప్పారు. అందరి దగ్గరా రూ. 10 కోట్లకు పైగా ఎగ్గొట్టిన సదరు ఘరానా చీటర్ ఇంటి పై బాధితుల దాడి చేశారు. ప్రజల సొమ్ములతో సుందరంగా కట్టుకున్న భవంతిని దగ్ధం చేసేందుకు ఉపక్రమించారు. ఇంటికి నిప్పంటించారు. నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పడమటి తండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రజలకి వడ్డీల ఆశ చూపి రూ. 10 కోట్లకు పైగా దోచేసి, తీరా తిరిగి సొమ్ములివ్వమంటే, వాటిని ఎగ్గొట్టి తిరుగుతున్న బాలాజీ నాయక్ అనే వడ్డీ వ్యాపారి ఇంటి పై బాధితులు కక్ష కొద్దీ రెచ్చిపోయారు. ఇంటి అద్దాలు పగులగొట్టి, ఫర్నీచర్ ధ్వంసం చేసి తగలబెట్టారు. కోర్టుకు పోయి ఐపీ పెట్టి 300 మందికి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న బాలాజీ నాయక్ ఇంటికి ఉదయం పెద్ద ఎత్తున బాధితులు తరలి వచ్చి బాలాజీ నాయక్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు.

# బీసీ రిజర్వేషన్ చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంఘం నిరసన

**- బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ**



**మునుగోడు వెలుతురు అక్టోబర్ 07:** బీసీ రిజర్వేషన్ చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలని మునుగోడు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపడం జరిగింది ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ ఆనగంటి కృష్ణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గుంటోజి వెంకటాచారి మాట్లాడుతూ ఖబర్దార్ మాధవరెడ్డి మా బీసీల పట్ల మీ కుట్ర ను మానుకోవాలని వారు హెచ్చరించారు బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు అలాగే కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు రెడ్డి జాగృతి నాయకులు కోర్టుకుపోయి రిజర్వేషన్ కోర్టుకు అడ్డుకునే ప్రయత్నాలు చేయడాన్ని అడ్డుకునే తీవ్రంగా మండిపడ్డారు హైకోర్టులో సుప్రీంకోర్టులో న్యాయమైన బీసీ రిజర్వేషన్ వాటాన్ని అడ్డుకోవాలని రిజర్వేషన్ వ్యతిరేకులు రెడ్డి జాగృతి నాయకులు చూడడం చాలా సిగ్గుమాలిన విషయం అని అన్నారు 60% ఉన్నటువంటి బీసీలు స్థానిక ఎన్నికలు సర్పంచులు ఎంపిటిసిలు కౌన్సిలర్ కావడం ఇష్టం లేక పిడికెడు శాతం ఉన్నటువంటి రెడ్డి సామాజిక వర్గాన్ని చెందినటువంటి మాధవరెడ్డి గోపాల్ రెడ్డి బీసీల నోటి ముద్దను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని అంతేకాకుండా అసెంబ్లీలో చట్టం చేసిన బీసీ బిల్లును గవర్నర్ ఆమోదించకుండా అలాగే ఉండడం చాలా విడ్డూరం అని అన్నారు కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొండ వెంకన్న కొండా మల్లేష్ బక్క కృష్ణయ్య పంతంగి వెంకన్న తన్నీరు నందివర్ధన్ బైరవని భానుప్రసాద్ కొమురవెల్లి నాయి తదితరులు పాల్గొన్నారు

# ఉల్లాస్ లక్ష్యాన్ని నెరవేర్చాలి.

## - ఎంపీడీవో రాములు.




**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 07**

నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త నిర్వహణలో మంగళవారం ఉపాధ్యాయులకు, వివో ఏ లకు చేపట్టిన "ఉల్లాస్ " ఒకరోజు మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని రామన్నపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆవుల రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యావకాశం పొందని 15 సంవత్సరాలు పైబడిన మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయుటకు ఈ ఉల్లాస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని 100 శాతం అక్షరాస్యత సాధించడం దీని లక్ష్యం అని దీనికై అందరూ తమ తమ స్థాయిలో కృషి చేద్దామని శిక్షకులను కోరారు. గ్రామ స్థాయిలో ఎంపిక చేసిన వాలంటీర్లకు 9వ తేది గురువారం శిక్షణనిచ్చి చైతన్యపర్చి ఆయా గ్రామాలలో గుర్తించిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడంలో వివో ఏలు ఉపాధ్యాయుల సహకారంతో తగిన బోధనా పద్ధతులను పాటిస్తూ బోధన జరిగేలా ప్రయత్నించి ఉల్లాస్ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమ డైరెక్టర్ మరియూ మండల విద్యాధికారి గవ్వ జ్యోతి, రిసోర్స్ పర్సన్ లు ఉయ్యాల బిక్షమయ్య, కొత్త కోటేశ్వర్, మరియూ బొడ్డుపల్లి రాములు, పాల్వంచ హరికిషన్, ఉపాధ్యాయులు, వివో ఏలు పాల్గొన్నారు.

# రామన్నపేటలో ఆశా డే మీటింగ్

**- ఆశాలకు డాక్టర్లు పలు సూచనలు**



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 07**

ఆశ డే మీటింగ్ సందర్భంగా డి ఎం, హెచ్ ఓ డాక్టర్ మనోహర్ మునిపంపుల పి హెచ్ సి కి రావటం జరిగింది. మీటింగ్ లో మాట్లాడుతూ గవర్నమెంట్ లో డెలివరీస్ ఎక్కువ అయ్యే విధంగా చూసుకోవాలి, మాతా శిశు సంరక్షణ అతి ముఖ్యమైన అంశంగా భావించాలి. ప్రైవేట్ లో అయ్యే డెలివరీల సంఖ్యను తగ్గించాలి.పిల్లలందరికీ కూడా వ్యాక్సిన్ వేయించాలి. టి బి పేషంట్లని రెగ్యులర్గా మానిటర్ చేయాలి. బీపీ, షుగర్ పేషెంట్స్ ని రెగ్యులర్గా ఫాలోఅప్ చేసి వారికి సరైన మందులు అందిఇవ్వాలి. డ్యూటీ ప్రథమ కర్తవ్యం నిర్వర్తించాలని మరియు ఇతర ప్రజా ఆరోగ్యానికి సంబంధించి విలువైన సూచనలు అందించడం జరిగింది. ఈ మీటింగ్ నందు డాక్టర్ సుమన్ కళ్యాణ్, డాక్టర్ అశ్విని కుమార్, ఎంఎల్ హెచ్ పి లు, సూపర్వైజర్స్, ఏఎన్ఎం లు, ఆశలు పాల్గొనడం జరిగింది.



తూప్రాన్ మన పాత్రికేయ మిత్రుడు పంజాల ఆంజనేయులు గౌడ్ మాతృమూర్తి మాజీ ఎంపీటీసీ వెంకటమ్మ గారు స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకున్న తూప్రాన్ సీనియర్ పాత్రికేయులు డా. జానకిరామ్ గౌడ్, శివశంకర్ గౌడ్, భాస్కర్ గౌడ్, శివక్రిష్ణ గౌడ్ లు వారి స్వగృహంలో నివాళులర్పించారు. ఆంజనేయులు గౌడ్ ను ఓదార్చి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతున్ని ప్రార్థించడం జరిగింది...

**తూప్రాన్ వెలుతురు అక్టోబర్ 07:**

# సాంస్కృతిక కార్యక్రమాల సారధి బండ్ల కృష్ణ కు గౌరవ డాక్టరేట్

## - సన్మానించిన డాక్టర్ ఎన్. అశోక్.

**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 07**

వెల్లంకి గ్రామానికి చెందిన బండ్ల కృష్ణ నిరుపేద కుటుంబం పుట్టి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని సమాజంలో నిలబడి సమాజానికి ఆదర్శంగా నిలిచాడని. జానపద గేయాలతో జనాన్ని ఉత్తేజ పరుస్తూ జానపదానికి ఉత్తేజం అందించిన వ్యక్తిగా చరిత్రలో నిలిచాడని. చరిత్రలో కవిగా రచయితగా రానిచ్చి రాష్ట్రంలో గుర్తింపు పొందాడని. తెలంగాణ ఉద్యమంలో కూడా పాటలతో క్రియాశీలక పోషించాడు. సాంస్కృతిక కార్యక్రమాలతో సాగిన ప్రదర్శనలకు అప్పటి నల్లగొండ ఎస్పీ. కళా నైపుణ్యాన్ని సమాజానికి అవసరమని బండ్ల కృష్ణ ను హెూమ్ గార్డ్ గా ఎంపిక చేశాడు.

అప్పటినుండి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా మూఢనమ్మకాలపై సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను సైన్స్ వైపు నడిపిన వ్యక్తిగా రాష్ట్రంలో నలువైపులా పేరు పొందిన వ్యక్తి బండ్ల కృష్ణ నిలిచాడు. కరోనాకాలంలో కూడా తన వేషధారణతో పాటలతో తన ప్రాణానిని లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలకు ప్రాణం పోసిన సాంస్కృతిక కళా జాతర వ్యక్తిగా గుర్తింపు పొందాడు.



కరోనా సమయంలో పాదయాత్రలతో తన లూనా పై జిల్లావ్యాప్తంగా తిరిగి చరిత్రలో నిలిచిన శక్తివంతమైన వ్యక్తిగా నిలిచాడని ఇప్పటికీ సమాజాన్ని చైతన్యం చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ హెడ్ కోటర్ లో హెూంగార్డుగా ఉద్యోగం చేస్తూ పోలీస్ శాఖకు గొప్ప గౌరవం తీసుకొచ్చిన వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు పోలీస్ శాఖ కూడా బండ్ల కృష్ణ సేవా కార్యక్రమాలకు ఎంతో ప్రశంసలు అందించింది అందుకుగాను ఢిల్లీ సాంస్కృతిక శాఖ వారు గౌరవ డాక్టరేట్ ప్రకటించి గౌరవం పెంచింది. గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి ఆశీస్సులు అందుకున్న వ్యక్తిగా చరిత్రలో నిలిచిన బండ్ల కృష్ణకు డాక్టర్ ఎన్. అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు కట్ట లింగస్వామి. దేశ బోయిన శ్రీధర్. కందాల శివశంకర్. బర్ల మహేష్. తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం మిగిలే ఉందని చాటిన జహీరాబాద్ రైల్వే మేనేజర్

## ఓ చిన్నారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన స్టేషన్ మేనేజర్ మాధవ కృష్ణ...

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రైల్వే స్టేషన్లో మానవత్వాన్ని చాటే ఘటన చోటుచేసుకుంది. ఒక నిర్లక్ష్యంతో చిన్నారి రైలులో తన తండ్రి నుంచి విడిపోయినా... రైల్వే సిబ్బంది చాకచక్యంతో అతడిని సురక్షితంగా తిరిగి తల్లిదండ్రులకు అప్పగించడం ప్రశంసనీయంగా నిలిచింది. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన స్వామి అనే ప్రయాణికుడు తన 5 ఏళ్ల కుమారుడు అఖిలేష్‌తో సహా కుటుంబంతో కలిసి హైదరాబాద్ నుంచి బీదర్ కు వెళ్తున్నాడు. రైలు జహీరాబాద్ స్టేషన్ వద్ద ఆగినప్పుడు స్వామి బాత్రూమ్‌కు వెళ్లేందుకు దిగాడు. చిన్నారి కూడా అతనితో దిగినా, అది తండ్రి గమనించలేదు. రైలు కదలడంతో స్వామి ఒక్కరే ఎక్కిపోగా, చిన్నారి స్టేషన్‌పై ఒంటరిగా మిగిలిపోయాడు. ఈ దృశ్యాన్ని



గమనించిన ప్రయాణికులు అప్రమత్తమై బాలుడిని స్టేషన్ మేనేజర్ మాధవ కృష్ణకు అప్పగించారు. మాధవ కృష్ణ, రైల్వే సిబ్బందితో కలిసి వేగంగా స్పందించి, తల్లిదండ్రుల వివరాలు సేకరించారు. వెంటనే మెటల్కుంట వద్ద పూర్ణ రైలును ఆపించి, అదే సమయంలో నాందేడ్ – బెంగళూరు వెళ్ళే ఎక్స్‌ప్రెస్‌ను అక్కడ్డ అత్యవసర పరిస్థులలో ఆపించి తల్లిదండ్రులను తిరిగి జహీరాబాద్‌కు తీసుకొచ్చారు. ధృవీకరణ అనంతరం చిన్నారిని వారికి సురక్షితంగా అప్పగించారు. ఈ చర్యపై ప్రయాణికులు రైల్వే సిబ్బందిని ప్రశంసిస్తున్నారు. "ఈ మానవీయ సేవ ప్రతి ఉద్యోగికి ఆదర్శంగా నిలవాలి" అంటూ కొనియాడారు. చిన్నారి తల్లిదండ్రులు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి క్షేమంగా తిరిగి రావడంతో స్టేషన్ ప్రాంగణంలో ఆనందం నెలకొంది.

***జాగ్రత్తలు పాటించండి – ప్రయాణికులకు సూచన:***

"పిల్లల పట్ల ప్రయాణ సమయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్త వహించాలి. పిల్లల చేతిలో చిరునామా, ఫోన్ నెంబర్లు ఉండేలా చూడాలి" అని స్టేషన్ మేనేజర్ మాధవ కృష్ణ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

# దత్తగిరి కాలనీలో రహదారులపై అక్రమ నిర్మాణాల తొలగింపు

**- అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారి పై చర్యలు తీసుకొంటాం ..**





**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దత్తగిరి కాలనీలో మున్సిపల్ అధికారులు ఆక్రమణలపై కఠిన చర్యలు చేపట్టారు. రోడ్డును ఆక్రమిస్తూ నిర్మించిన షెడ్లు, మెట్లు, దుకాణాలు జేసీబీలతో కూల్చివేశారు. ఈ కూల్చివేతలు దత్తగిరి కాలనీ చౌరస్తా నుండి ఆదర్శనగర్ ప్రధాన గేట్ వరకు మున్సిపల్ సిబ్బంది మరియు పోలీసుల పర్యవేక్షణలో కొనసాగాయి. అక్రమ నిర్మాణాల వల్ల రహదారులపై ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఈ చర్యలకు దిగారు. అక్రమంగా ప్రభుత్వ రోడ్లపై నిర్మాణాలు చేపట్టిన వారి పై మున్సిపల్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని, ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని విడిచిపెట్టే ప్రసక్తి లేదని అధికారులు హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని, రహదారులపై నిర్మాణాలు చేపట్టరాదని మున్సిపల్ అధికారులు సూచించారు.

# జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం...

## కాంగ్రెస్ పార్టీ చేరిన పలువురు బీఆర్ఎస్ నేతల చేరిక...





**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాఎం ఏ. చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. మండల స్థాయి కీలక నాయకులతో జరిగిన ఈ సమావేశంలో రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలపై వ్యూహాత్మకంగా చర్చించబడింది. ఈ సందర్భంగా డాఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ, పార్టీకి నిజమైన సేవ చేసిన కార్యకర్తలకే టికెట్లు కేటాయిస్తామని, బాధ్యతగా, నిజాయితీగా ఉన్న వారే విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీని కష్టకాలంలో నమ్ముకున్నవారికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని తెలిపారు.



### బీఆర్ఎస్ నుంచి తీర్థం పుచ్చుకున్న 20 మంది కాంగ్రెస్ నేతలు :

సందర్భంగా శేఖపూర్ తండాకు చెందిన 20 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి మాజీ మంత్రి స్వాగతం పలికారు. కాంగ్రెస్ సిద్ధాంతాల పట్ల నమ్మకంతోనే వారు పార్టీలోకి వచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్, నాయకులు ఉజ్వల్ రెడ్డి, మండల అధ్యక్షుడు నరసింహా రెడ్డి, సిడిసి చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ముబిన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబ్బాస్సుమ్, హుగ్గెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర డిజిపిని కలిసిన తెలంగాణ సర్పంచ్ ల సంఘం జేపీసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
ప్రభుత్వం మా సర్పంచ్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలంటే ఇవ్వకుండా మొండి చేస్తుంది అందుకే తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉన్నత అధికారి డిజిపి గారిని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిన తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ తాజా మాజీ సర్పంచులు వడ్డీలకు రూపాయలు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేయడం జరిగింది . అట్టి సర్పంచులు అప్పుల బాధ తో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు మరి కొంతమంది కుటుంబాలు అప్పుల బాధతో చిన్నాభిన్నము అవుతున్నాయి.ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ డేట్ విడుదల చేసినారు.మా బిల్లులు వస్తాయో రావో అని అయోమయంలో ఆందోళన చెందుతున్నాము . గ్రామ అభివృద్ధి పను పనులకు వడ్డీలు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచులు అప్పుల బాధ తో ఆత్మహత్యలు చేసుకున్నారు మరి కొంతమంది కుటుంబాలు అప్పుల బాధతో చిన్నభిన్నమవుతున్నవి ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ డిలీట్ చేసినారు మా బిల్లులు వస్తాయో రావో అని అయోమయంలో ఆందోళన చెందుతున్నారు తెలంగాణ డిజిపి గారు మాకు న్యాయం చేయండి.చెక్ బౌన్స్ కేసులు ఏ విధంగా నమోదు చేస్తారో ఆ విధంగా మా సర్పంచ్ల గ్రామ అభివృద్ధి పనులు చేసిన చెక్కులు జనరేషన్ చేసిన వారిపై కేసు నమోదు చేయాలి..గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ముఖ్యమంత్రికి మంత్రులకు పంచాయచతీరాజ్ ఉన్నత అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చి విన్నవించిన ప్రభుత్వానికి చలనం లేదు. తెలంగాణ రాష్ట్రంలో బిల్లులు చెల్లించాలని ముక్కోటి దేవతలను మొక్కిన ప్రభుత్వానికి కనికరం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ప్రభుత్వాలు ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టినందున ఎవరితో మొర పెట్టు కోవాలో తెలియని పరిస్థితి ఉన్నది .మరి చట్టాలు దేనికి ఉన్నది . చట్ట ప్రకారం అప్పు తీసుకున్నప్పుడు చెక్కులు తీసుకొని అప్పులు ఇస్తారు.అప్పు తీర్చలే నప్పుడు చెక్కు బ్యాంకులో వేసినాక చెక్ బౌన్స్ అయితే పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేస్తే ఆ పిటిషన్ దారుకు కు కోర్టులో న్యాయం జరుగుతుంద.మరి మా సర్పంచుల పెండింగ్ బిల్లులు 22 నెలలుగా ఈ ప్రభుత్వం ఇవ్వలేక పోతుంది మరి ప్రభుత్వం పైన పోలీస్ వ్యవస్థ చట్టపరమైన చర్యలు తీసుకొని మా సర్పంచ్లకు న్యాయం చేయాలి.

## జహీరాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద నిలిచిన వరద నీరు ... ప్రజల ఆవేదన

- **ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడంతో రోడ్డుపై నిలిచిన వరద నీరు...**
- **చెరువును తలిపిస్తున్న కాలనీ రోడ్డు...**
- **పట్టించుకోని మున్సిపల్ అధికారులు...**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నానాటికీ పెరిగిపోతున్న పౌర సమస్యలపై మున్సిపల్ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం స్థానికులను తీవ్రంగా కలిచివేస్తోంది. జాతీయ రహదారి 65 పక్కన ఇటీవల నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ కింద ఉన్న కాలనీలు మోకాళ్ల లోతు వరద నీటిలో మునిగిపోయాయి. కాలనీ రహదారులు ఒక చెరువును తలపిస్తున్న స్థితి నెలకొంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో స్టోర్మ్ వాటర్ డ్రెయిన్‌ను ధ్వంసం చేయడం, అలాగే కొంతమంది వ్యక్తులు డ్రెయిన్ పై ఆక్రమణలు చేసి వ్యాపారాలను ఏర్పాటు చేయడం వల్ల వర్షపు నీరు ఎటు వెళ్లకుండా రోడ్లపై నిలిచిపోతుంది. ముఖ్యంగా రాంనగర్ ప్రాంతం నుండి వచ్చే వరద నీరు ఓవర్ బ్రిడ్జ్ కింద ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా ముంచేస్తోంది. ప్రజలు నిత్యం ఇంటి నుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారుల చదువు, వృద్ధుల వైద్య సదుపాయాలు అన్నీ ప్రశ్నార్థకమవుతున్నాయి. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, అధికారుల వైపు నుంచి ఎటువంటి స్పందన లేదు. ఈ పరిస్థితిపై తెలంగాణ బీజేపీ ఓబీసీ మోర్చ సీనియర్ నాయకులు సుధీర్ భాండారి మాట్లాడుతూ, “ఇది నిర్లక్ష్య పాలనకు నిదర్శనం. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే, జిల్లా ఉన్నతాధికారులను కలిసేంత వరకు పోరాటం చేస్తాం” అని హెచ్చరించారు. స్థానికులు సమస్యను వేడిగా లేవనెత్తుతూ, తక్షణమే డ్రెయిన్ వ్యవస్థ పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**- ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాలు నిరసన**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై సనాతన ధర్మం ముసుగులో జరిగిన మనువాద దాడిని ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘం తీవ్రంగా ఖండిస్తుంది.ఈ దాడి దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజు. భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే భావిస్తున్నాం. తెలంగాణ ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి రమేష్ తెలిపారు, ఈ దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ,ఆధిపత్య కులాల నుండి అవమానాలు మాత్రం తప్పడం లేదు.దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే జస్టిస్ బి.ఆర్.గవాయిపై జరిగిన దాడి. ఈ దేశంలో వేల ఏళ్లుగా అవమానాలకు గురవుతున్న జాతులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారం దక్కాలి. రాజ్యాధికారం దక్కనంతకాలం మన జాతులకు అవమానాలు, అణిచివేతలు, దాడులు తప్పవు.ఈ దేశంలో రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఎంతటి ఉన్నత స్థాయి పదవులు అనుభవించిన సరే,వాళ్ళకు ఆత్మగౌరవం,రక్షణ రెండూ ఉండవు. ఇంతకాలం అవమానాలు, అణిచివేతలకు గురైన వర్గాల ప్రజలే ఇప్పుడు దేశాన్ని పాలించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే మన జాతులకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం దక్కుతుంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మనువాదులతో అహర్నిశలు పోరాటం చేస్తున్నారు. జస్టిస్ బి.ఆర్.గవాయికి ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుంది. నేడు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సంఘాల నాయకులు అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో మీడియా సమావేశాలు నిర్వహించి ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. తెలుగు నేలపై మహాత్మా పూలే, అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో పోరాడుతున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ కుల సంఘాల నాయకులు జస్టిస్ బి.ఆర్ గావాయి పై జరిగిన దాడిని గమనించాలి. సనాతన ధర్మం ముసుగులో జరుగుతున్న ఇటువంటి అమానవీయ దాడులను తీవ్రంగా ఖండించాలి. రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ సంఘాల రాష్ట్ర నాయకులు కే చంద్రయ్య. ఆనంద్ బాబు. బీచుపల్లి, రవీందర్, శరబంద. సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అందరి విముక్తి లోనే ట్రాన్స్ జెండర్ జెండర్ విముక్తి ఉంది

- **అల్ ఇండియా ట్రాన్స్ జెండర్ల యాక్టివిస్టు రచన ముద్రబోయిన రచన**
- **ట్రాన్స్ జెండర్ , హిజ్రాల హక్కులు, బాధ్యతలు గుర్తించాలి**
- **సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తాం వివక్ష, హింస ను అంతం చేస్తాం**
- **ట్రాన్స్ పీపుల్స్ రైట్స్ హుమన్స్ రైట్స్ గా పరిగణించాలి**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
ట్రాన్స్ జెండర్లు ప్రజలతో మమేకంగా కావాలి ,ట్రాన్స్ జెండర్ల సమస్యలను హక్కులను ప్రభుత్వాలకు అర్థం చేయించాలని , హక్కుల కోసం పోరాడుతూనే ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలని భయం ,బాధ్యత రెండిటిపై అవగాహన కోసం అక్టోబర్ 7న ఉదయం 11 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి హైదరాబాద్ లో ట్రాన్స్ జెండర్లు హిజ్రాలు రాష్ట్ర సదస్సు జరిగింది ఈ సదస్సు కు అల్ ఇండియా ట్రాన్స్ జెండర్ల యాక్టివిస్టు రచన ముద్రబోయిన తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు పత్రిక విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ .. తెలంగాణ లోని హిజ్రాలు ట్రాన్స్ జెండర్లు సుమారు 3 లక్షల మంది ఉన్నారని వారి సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు విద్య వైద్యం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు గృహనిర్మాణం, కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తికి సమానమైన హక్కులు ఉండాలని మన రాజ్యాంగం చెపుతుంది ఆడ మగకు మాత్రమే కాదు హిజ్రాలు ట్రాన్స్ జెండర్లు కు గుర్తించాలని సూచించారు హిజ్రాలు, ట్రాన్స్ జెండర్ల సదస్సు లో సాధించిన హక్కులు ప్రజల పట్ల బాధ్యత పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ హిజ్రా, ట్రాన్స్ జెండర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు మోనాలిసా మాట్లాడుతూ హిజ్రాలు ట్రాన్స్ జెండర్ లు అంటే అడుక్కోవడం వ్యభిచారం చేయడమేనా మనుషుల్లా మమ్మల్ని గుర్తించండి హిజ్రాల సముదాయం కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలి తెలంగాణ ట్రాన్స్ జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ రైట్స్ వెంటనే అమలు చేయాలి అని అన్నారు %జూశీష% నాయకురాలు సంధ్య సామాజిక వేత్తలు కొండవీటి సత్యవతి,సజయా గార్లు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు ప్రజలను అర్థం చేసుకోవాలి ట్రాన్స్ జెండర్ సమస్యలను ప్రభుత్వాలు గుర్తించాలి లింగమార్పిడి చేసుకోవడానికి అవసరమైన సహాయం ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు దేశంలో హిజ్రాలు ట్రాన్స్ జెండర్లు అరువనీలు తిరునంగీలు జోగప్పలు శివసత్తులు ఇలా ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కలా పిలుస్తారు వీరందరికీ సమాన హక్కులు కల్పించాలని కోరారు తెలంగాణ లో ప్రత్యేక సర్వేలు చేసి హక్కులను గుర్తించి ఆర్థిక సహకారం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ 60 మంది గురువులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సంఘమిత్ర, సోనీ,మనోరమ, ప్రియా,శిల్ప,ప్రేమమ్మ,శోభ, సమీరా, యాస్మిన్,సోనారథోడ్, శ్రావణి సమంత, చిట్టి,నందన తదితరులు పాల్గొన్నారు అతి త్వరలో ట్రాన్స్ జెండర్ హిజ్రాల కల్చరల్ ఫెస్ట్ 2025 నవంబర్ చివర్లో నిర్వహించి తమ ప్రతిభ పాటవాలు సమాజానికి తెలియజేయాలని తీర్మానించారు

# 42 శాతం బిసి రిజర్వేషన్లకై మహోజ్వల పోరాటం

### అంబాల నారాయణ గౌడ్ బిసి పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
42 శాతం బిసి రిజర్వేషన్ల విషయంలో జుడిషియల్ న్యాయ స్థానాల్లో బిసిల వాదం నిలిచే అవకాశం లేదు. బిసిల న్యాయపరమైన వాటకోసం రాజ్యాంగంలో రక్షణ చట్టం లేదు, ఒక వేల ఉన్న పార్లమెంట్ లో అధికారంలో ఉన్న పార్టీల మద్దతు లేదు. న్యాయమైన బిసిల వాట కోసం అసెంబ్లీ లో ప్రజలు ఎన్నుకున్న సభ, సభలోని అన్నీ పార్టీల సభ్యులు సంపూర్ణ మద్దతు తెలిపి చట్టం కోసం బిల్లులు రాష్ట్రపతి గవర్నర్ కు పంపిన నెలలు గడిచిన ఆమోదం పొందవు. జనభా దామషా ప్రకారం sc st లకు ews వారికి రిజర్వేషన్లు ఉన్నపుడు ప్రభుత్వం చెబుతున్న 56 శాతం ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే కొంతమంది హైకోర్ట్ కు సుప్రీం కోర్ట్ కు వెల్లి అడ్డుకునే ప్రయత్నం లో ఉన్నారు. మాన్య శ్రీ కాన్షీ రాం అన్నట్లు ఈ దేశంలో మెజారిటి ప్రజలైన బిసిలు అన్నీ రంగాల్లో అబివృద్ది సాదించకపోతే దేశం అబివృద్ధి చెందదని ఎంతో ముందు చూపుతో చెప్పారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చాల మంది బడుగు వర్గాల వారు గాంధీని అనుసరించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఈ దేశంలో చేతివృత్తులు పరిఢవిల్లుతున్నవి. కొంతమేర విదేశి చేనేత దుస్తువులు బహిష్కరణ ఉద్యమం జరిగిన మొత్తం వంద సంవత్సరాల ముందు చూపు ఆనాటి స్వాతంత్ర్య యోదులకు లేదు. ఇలాగే కుల వ్యవస్థ, కుల వృత్తులు ఉంటాయని అనుకున్నారు. రాజ్యాంగ రచన కమిటిలో బిసిల హక్కుల కోసం బలంగా వాదించే వారు లేని కారణంగా బిసిల హక్కుల కోసం ప్రత్యేకమైన చట్టాలు శాసానాలు రాలేదు. బిసిల వెనుకుబాటు 80 సంవత్సరాల గడిచిన తర్వాత వెనుకుబాటు మార్పు పెద్ద ఎత్తున కనిపిస్తున్నది. ముఖ్యంగా బిసి కులాలు చేతివృత్తులను నమ్ముకున్నవారు నేడు వారి వృత్తులు విధ్వంసం అయినవి. వృత్తుల ఆధునీకరణ జరగలేదు. కారల్ మార్క్స్ అన్నట్లు ప్రతి వంద సంవత్సరాల కోసారి చేతివృత్తుల విధ్వంసం జరుగుతుంది వాటి స్థానంలో కొత్త వృత్తులు కొత్త సాంకేతిక వస్తాయని ఆనాడే ముందు చూపుగా చెప్పారు. మెజారిటీ ప్రజలైన బిసిలకు వారి అబివృద్దికి కేంద్రం రాష్ట్రం బడ్జెట్లో పెద్ద ఎత్తున వివక్ష చూపుతున్నవి. బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ నేటికి లేదు బిసిల పైన యంబిసిల దేశ వ్యాప్తంగా అనేక రకాల దాడులు జరుగుతున్నవి. వాటిపైన బలమైన రక్షణ చట్టాలు నేటికి రావడం లేదు. తెలంగాణ లో ఈ మధ్య కాలంలో బిసి కుల వృత్తుల వారిని అడిగినంత డబ్బులు ఇవ్వడం లేదని ఉత్తర తెలంగాణ లో గ్రామ అబివృద్ధి కమిటిలు (విడిసిలు ) గ్రామ బహిష్కరణలు బౌతిక దాడులు చేస్తు బయ బ్రాంతులకు గురి చేస్తున్న సంఘటనలు చూస్తున్నాము . రాజకీయ పార్టీల మోసపూరిత వాగ్ధానాలు బిసిలను, బిసి కులాల వారిగా దశాబ్దాల కాలంగా మోసం చేస్తునే ఉన్నారు. సామాజిక సమన్యాయం అనేది అడవికాసిన వెన్నలే అయ్యింది. యంబిసిల పరిస్థితి మరి దారుణం వారు వేల సంవత్సరాల నుండి మానవీయ నాగరిక సమజం కోసం ఈ దేశం కమ్మరి కొలిమి , కుమ్మరి చక్రం మంగలి కత్తి ఇలా వడ్డెర పూసల గంగ పుత్రులు అనేక కులాల వారు స్వాతంత్ర్య పలాలు అందలేక సామాజిక వివక్ష నేటికి అనుభవిస్తున్నారు. కనీసం చట్ట సభల గడప చూడని కులాలు అనేకం. రాజ్యాంగ హక్కులు సాదించడానికి బిసిలు మరో పోరాటానికి సిద్ధం కావలసిన అవసరం ఉంది.

# బీసీ హక్కులకై రాష్ట్రాన్ని స్తంభింప చేస్తాం

**- బీసీ సంఘాల ఆగ్రహం**





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
మంగళవారం రోజున హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన “బీసీలకు 42శాతం రిజర్వేషన్లు - న్యాయ వివాదాలు పరిష్కారం” పై ”బీసీ సంఘాల సమాలోచన“ కార్యక్రమం మాజీ మంత్రివర్యులు వి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాలు, బీసీ విద్యావంతులు, బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సర్పంచుల సంఘం, ఎంపిటిసిల సంఘం, జెడ్పిటిసిల సంఘం తదితర సంఘాలు పాల్గొన్నాయి.. ముఖ్య అతిథులుగా మాజీ చైర్మన్, బిసి జాతీయ కమిషన్, జాతీయ ఓబీసీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య గౌడ్ ,బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు ,బీసీ, ఎస్సీ,ఎస్టీ, జేఏసీ చైర్మన్ డా. విశారదన్ మహారాజ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. మండల్ కమిషన్ కు వ్యతిరేకంగా కమండల ఉద్యమం నడిపిన నీచ చరిత్ర బిజెపి ది అన్నారు.. ఏ ఉద్యమం చేయకపోయినా ఆగ మేఘాల మీద ఈడబ్ల్యూఎస్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టి నాలుగురోజుల్లో అమలు చేయడంపై బీజేపీ కుటిలనీతి అన్నారు. 42% బిసి రిజర్వేషన్ బిల్లు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి కొరవడిందని.. అదె ఉంటే పార్లమెంటులో ఆ పార్టీ 42% బిల్లుపై చర్చ జరపాల్సిఉండగా కనీసం ఆ ఊసెంతలేదని విమర్శించారు.. మరో తెలంగాణ ఉద్యమం కంటే బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి మొత్తం రాజకీయ పార్టీలకు అతీతంగా ఏ ఒక్క కుల సంఘాన్ని బీసీ సంఘాన్ని ఓదలకుండా జేఏసీగా ఏర్పాటుచేసి ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు.. బీసీ రిజర్వేషన్లపై చట్టబద్ధత వచ్చేంతవరకు ఉద్యమ కార్యచరణ ఆగదని ఈ ఉద్యమ రూపం రాజ్యాధికారం వైపు పయనిస్తామని.. దళిత,బహుజనలకు పిలుపునిచ్చారు... BCPF అధ్యక్షులు కుమార్ గౌడ్, BCPF జనరల్ సెక్రటరీ ప్రణీల్ చందర్, సర్పంచ్ ల సంఘం జేఏసీ చైర్మన్ యాదయ్య గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, బీసీ సంఘాల నాయకులు ఎస్. దుర్గయ్య గౌడ్, గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్, కోలా జనార్ధన్ తదితరులు పాల్గొని చర్చించడం జరిగింది.

# ఊరూరా నారావారి నాటు సారా


- మొలకల చెరువు ఘటనతో అడ్డంగా బుక్
- కడప ఎంపి అవినాశ్ రెడ్డి విమర్శలు



**అమరావతి,అక్టోబర్7( వెలుతురు):**
నకిలీ మద్యం వ్యవహారంపై కూటమి సర్కార్‌పై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.. నారావారి సారా ఏ స్థాయిలో అమ్ముతున్నారో ఇట్టే అర్థమయిపోతోందని మండిపడ్డారు. రాయలసీమ, కోస్తా ఆంధ్రాలో నకిలీ మద్యం కంపెనీలను ఏర్పాటు చేసి.. నారావారి ఎన్ బ్రాండ్ తో ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారన్న ఆయన.. మొలకలచెరువులో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి నకిలీ మద్యం సీజ్ చేశారని.. దీంతో టీడీపీ అడ్డంగాదొరికి పోయిందన్నారు. మొలకలచెరువులో తయారు చేస్తున్న మద్యాన్ని రాయలసీమకు మళ్లిస్తూ కృష్ణా జిల్లాలో తయారు చేస్తున్న నకిలీ మద్యాన్ని కోస్తాంధ్రకు తరలిస్తూ.. కోట్ల దండుకున్నారని.. ఇప్పటి వరకు 5,280 కోట్ల రూపాయల విలువైన అమ్మకాలు జరిగాయని అన్నారు.. ఇక, రాష్ట్రవ్యాప్తంగా 48 కోట్ల క్వార్టర్ బాటిళ్ల కేసులు అమ్ముడయ్యాయి అన్నారు అవినాష్ రెడ్డి.. ఏడాది కాలంలోనే ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ లేకుండా నకిలీ మద్యం అమ్మకాలు చేస్తున్నారు.. 5280 కోట్ల కుంభకోణానికి తెర లేపి, ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయినా.. ఈ ప్రభుత్వంకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు.. ఇలాంటి ప్రభుత్వానికా మనం ఓటు వేశామని ప్రజలు భాధపడుతు, పచ్చాత్తాపపడుతున్నారని తెలిపారు.. నారావారి ఎన్ బ్రాండ్ సారాను అమ్మడం అంటే ప్రజల బలహీనత సొమ్ము చేసుకొని దెబ్బకొట్టారని ఆరోపించారు.. చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ తప్పు కప్పిపుచ్చుకోలేనిదిని, దీనికి భవిష్యత్తులో భారీ మూల్యం చల్లించుకోక తప్పదని జోస్యం చెప్పారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి నకిలీ మద్యంతో సంబంధం లేదని తయారీదారుడు విడుదల చేసిన వీడియో చూస్తే ఇంకా అనుమానాలు బలపడుతున్నాయని అన్నారు. నిందితులను తప్పించడానికి అగ్ర నాయకత్వం కృషి చేస్తుందని వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు

# ఆప్ నేత కేజ్రీవాల్‌కు ఊరట

- ఢిల్లీ లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళా కేటాయింపు





**న్యూఢిల్లీ,అక్టోబర్7( వెలుతురు):**
ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఎట్టకేలకు అధికారిక నివాసం కేటాయించింది. ఇకపై 95, లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళాలో ఆయన ఉండనున్నారు. దిల్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం గత ఏడాది అక్టోబరులో ఆయన సీఎం అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. దిల్లీలో మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ వసతి కేటాయించే నిబంధన లేదు. దీంతో ఆయన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించిన లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న 5వ నంబరు బంగళాలో తాత్కాలికంగా ఉంటున్నారు. ఈక్రమంలోనే గుర్తింపుపొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడిగా కేజ్రీవాల్ కు తగిన నివాసం కేటాయించాలంటూ ఆప్ న్యాయపోరాటం చేసింది. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం నూతన బంగళాను కేటాయించింది. బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన 35, లోధి ఎస్టేట్‌లోని బంగళాను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆప్ కోరింది. కానీ, దాన్ని జులైలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీకి కేటాయించింది. కేజీవ్రాల్‌కు ఇప్పుడు కొత్తగా కేటాయించిన ఇంట్లో గతంలో భాజపా నేత, జాతీయ మైనారిటీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు.నూతన నివాసాన్ని కేజీవ్రాల్ దంపతులు ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. పక్కనే ఉన్న 97వ భవనంలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఉంటున్నారు. ఇదిలాఉండగా.. సీఎంగా ఉన్నప్పుడు సివిల్ లైన్స్ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఆరో నంబరు బంగళాను కేజీవ్రాల్ అధికార నివాసంగా ఉపయోగించేవారు. ఆ సమయంలో దానికి అనేక హంగులు చేసి పునర్నిర్మించారు. ఇందులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా విమర్శలు గుప్పించింది. ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది. ఇప్పుడు ఈ భవనాన్ని ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌గా మార్చాలని దిల్లీ లోని భాజపా ప్రభుత్వం యోచిస్తోంది.

# 16న మోడీ శ్రీశైలం పర్యటన ఖరారు


- ఏర్పాట్లను పరిశీలించిన బిజెపి అధ్యక్షుడు మాధవ్



**నంద్యాల,అక్టోబర్7( వెలుతురు):**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైలం క్షేత్ర పర్యటన ఖరారైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. శ్రీశైలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోది పర్యటించే ప్రదేశాలైన ఛత్రపతి శివాజి స్ఫూర్తి కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. మంగళవారం శివాజి రాజదర్బార్, శివాజి ధ్యానమందిరం ఏర్పాట్లను ఎంపీ బైరెడ్డి శబరి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పరిశీలించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ.. సరళీకృత జీఎస్టీ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమానికి ఈనెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పాల్గొంటారని తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ మొదటిసారిగా శ్రీశైలం రావడం శుభ పరిణామమని అన్నారు. ప్రధాని శ్రీశైలం పర్యటనతో క్షేత్ర వైభవం మరింత పెరుగుతుందన్నారు. శ్రీశైలం ప్రాంతం యొక్క విశిష్టత టూరిజం అభివృద్ధి ఈ ప్రాంతం యొక్క విశేషాలు ప్రపంచానికి తెలిసే అవకాశం ఉందని చెప్పారు. శ్రీశైలం మల్లన్న దర్శనం అనంతరం శివాజి స్ఫూర్తి కేంద్రానికి ప్రధాన మంత్రి మోదీ చేరుకుంటారని మాధవ్ పేర్కొన్నారు.

# పావని గౌడ్ అసభ్య వ్యాఖ్యలపై టీఆర్పీ పార్టీ ఘాటు ప్రతిస్పందన

- తీన్మార్ మల్లన్నపై వ్యక్తిగత విమర్శలు నిందనీయం...
- టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్...



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
టీఆర్పీ పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నపై బీఆర్ఎస్ మహిళా నేత పావని గౌడ్ అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వ్యక్తిగతంగా దాడి చేయడం దారుణమని, ఇలాంటి మాటలు సామాజిక సంస్కృతిని దిగజార్చేవి అని టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం మధ్యాహ్నం ఒక పత్రికా ప్రకటనలో ఆమె మాట్లాడుతూ...సామాజిక సేవలో అంకితభావంతో పనిచేస్తున్న మల్లన్న ని వ్యక్తిగత జీవితంతో కించపరచడం దారుణం. 'నువ్వు పెళ్లిళ్లు చేసినవా? పురుడు పోసావా?' అంటూ ప్రశ్నించడం మహిళగా ఉన్న పావని గౌడ్ కు ఎంతవరకు తగినదో ప్రజలే న్యాయం చెయ్యాలి"లి అని తెలిపారు.

***బీఆర్ఎస్ నాయకుల మౌనం అసలైన ముఖం చూపుతోంది:***
పావని గౌడ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు మౌనం పాటించడం ద్వారా వారు కూడా అదే దుష్ప్రటానికి పాల్పడుతున్నట్లేనని జ్యోతి పండాల్ ఆరోపించారు. "ఇంటర్వ్యూలలో 'బ్రోకర్', 'వాడు–వీడు' వంటి పదజాలం ఉపయోగించి మల్లన్నని లఘువుగా చూచే ప్రయత్నం చేశారంటూ ఆమె విమర్శించారు.

***మా పార్టీకి సంస్కారం ఉంది – కానీ అవసరమైతే సమాధానం ఇవ్వగలము:***
"మా పార్టీలో మహిళల పట్ల గౌరవం, నాయకులంతా సంస్కారబద్ధంగా ప్రవర్తించేందుకు కట్టుబడి ఉంటారు. అయినా ఇలాంటి విమర్శలు మేమూ చేయగలము. కానీ మేము సంస్కారం ఉండే వారు, అందుకే మౌనంగా ఉన్నాం. కానీ ఇది శాశ్వతం కాదని, బీఆర్ఎస్ నేతలు తమ వ్యవహారశైలిని మార్చుకోకపోతే గట్టి ప్రతిస్పందన ఇచ్చే అవకాశం మాకుంది" అని జ్యోతి పండాల్ హెచ్చరించారు.

# చీఫ్ జస్టిస్‌పై దాడి అమానుషం

- దాడి చేసిన వ్యక్తిపై చర్యకు వెంకయ్య డిమాండ్



**నెల్లూరు,అక్టోబర్7( వెలుతురు):**
భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఖండించారు. దాడికి ప్రయత్నం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఛీఫ్ జస్టిస్‌కి సంబంధించిన అంశం కాదు, సమాజానికి, వ్యవస్థకి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పార్టీ మారితే.. ఆ పార్టీ ద్వారా పొందిన పదవికి రాజీనామా చేయాలని వెంకయ్యనాయుడు తెలిపారు. రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ని సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ మారి మంత్రులు అవుతున్నారని ఆరోపించారు. చట్టానికి అతీతంగా ఎవరూ వ్యవహారించకూడదని సూచించారు. ప్రజలకి అందించే ఉచితాలు పరిధులు దాటుతున్నాయని వివరించారు. ప్రభుత్వాలు తాహతుకు మించి అప్పులు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు అప్పులు తెచ్చేటప్పుడు, ఎలా తీరుస్తారో ప్రణాళికలు అసెంబ్లీలో చర్చించాలని ఆయన కోరారు. చట్టసభల్లో కుటుంబ సభ్యులని దూషించడం సరికాదని వెంకయ్యనాయుడు హితవు పలికారు. అలాంటి వారిపై చట్టాన్ని ప్రయోగించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మన దేశంలోనే ఉందని గుర్తుచేశారు. మనదేశ కీర్తిని ప్రతి ఒక్కరూ చాటాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల క్రిమినల్ కేసులపై రెండేళ్లలోపే విచారణ జరగాలని చెప్పారు. ప్రభుత్వాలు కోర్టుల సంఖ్యలు పెంచి, జడ్జీలని నియమించాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకమని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

# మెడికో విద్యార్ధినికి సాయం అందించిన దాతలు....

- వైద్య విద్యార్థినికి అండగా నిలిచిన ఎన్ ఆర్ ఐ బర్లా రమేష్..
- విద్యార్థిని అల్లం కీర్తి (తండ్రి బిక్షమయ్య, నల్గొండ) ఆర్థిక సాయం అభినందనల వెల్లువా...






**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:**
నిరుపేద వైద్య విద్యార్థినికి అండగా నిలిచిన ఎన్ ఆర్ ఐ బర్లా రమేష్, ఆర్ ఆర్ అపోలో మెడికల్ అకాడమీ చైర్మన్ రమణారెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిప్రసాద్. ఆ అకాడమీలో చదివి ఎన్ ఈ ఈ ట్ లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థిని అల్లం కీర్తి (తండ్రి బిక్షమయ్య, నల్గొండ) టి ఆర్ ఆర్ మెడికల్ కాలేజ్‌లో ప్రభుత్వ కోటాలో సీటు సాధించింది. అయితే కాలేజ్ ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతుండగా రమణారెడ్డి తన మిత్రులు నరేష్ (ఐ ఆర్ ఎస్ అధికారి), రవిప్రసాద్, రాధాకృష్ణ ద్వారా ఎన్ ఆర్ ఐ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బర్లా రమేష్ సహకారంతో ?1,70,000 ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. రమణారెడ్డి, రవిప్రసాద్ మిత్రబృందం అందించిన ఈ సహాయానికి విద్యార్థినీ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థిని అల్లం కీర్తి మాట్లాడుతూ నీట్ లో విజయం సాధించినందుకు.... నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను. అలాగే వైద్య విద్యకు సహాయం అందించిన దాతలకు కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను .మీ అందరి సహకారం ఉండాలి. ఇంకా రెట్టింపు ఉత్సాహంతో కష్టపడి చదివి పేదలకు ఉచిత వైద్యం అందజేయాలనేదే నా కల అని ఆమె అన్నారు.

# పైడితల్లి సిరిమానోత్సవం ప్రారంభం

- వేడుకలో పాల్గొన్న ప్రముఖులు
- బొత్స దంపతులకు తప్పిన ప్రమాదం





**విజయనగరం,అక్టోబరు7( వెలుతురు):**
ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం కన్నులపండువగా ప్రారంభమైంది. పూజారి వెంకటరావు సిరిమానును అధిరోహించారు. చదరగుడి నుంచి విజయనగరం కోట వరకు సిరిమానును ఊరేగించనున్నారు. ముందుగా పాలధార, తెల్ల ఏనుగు, జాలరివల, అంజలి రథం ఊరేగింపుగా వెళ్తుండగా.. భక్తుల జయజయ ధ్వానాల నడుమ అమ్మవారి సిరిమాను ముందుకు సాగుతోంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు సిరిమానును దర్శించుకున్నారు. ఇదిలావుంటే పైడితల్లి సిరిమానోత్సవాల్లో స్వల్ప అపశ్రుతి చోటు చేసుకుంది. శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు, మాజీ ఎమ్మెల్యే అప్పల నరసయ్య, మాజీ ఎంపీ బెల్లం చంద్రశేఖర్ కూర్చుకున్న వేదిక కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ఆపద వాటిల్లలేదు. వేదిక వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న విజయనగరం గ్రామీణ సీఐ అశోక్ చేతికి స్వల్ప గాయమైంది. శాసనమండలి ప్రతిపక్ష నేత, వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త బొత్స సత్యనారాయణ కుటుంబానికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. బొత్స కుటుంబం విజయనగరంలో శ్రీ పైడితల్లి సిరిమానోత్సవం చూస్తుండగా వేదిక కూలింది. బొత్స కుటుంబంకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయగా.. సిరిమానోత్సవం ప్రారంభమైన కాసేపటికే వేదిక ఒక్కసారిగా కూలింది. ఈ ఘటనలో బొత్స కుటుంబ సభ్యులకు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సిరిమానోత్సవ తిలకానికి ప్రత్యేకంగా అర్బన్ బ్యాంక్ ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన వేదిక అకస్మాత్తుగా కూలిపోయింది. శ్రీ పైడితల్లి సిరిమానోత్సవంలో వేదిక కూలడంతో ఎస్సై అశోక్, మరో చిన్నారికి గాయాలు అయ్యాయి. ఇద్దరిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బొత్స కుటుంబ సభ్యులు కూర్చున్న ముందర వేదిక ఒక్కసారిగా కూలింది. దాంతో బొత్స, ఆయన సతీమణి ఝాన్సీ లక్ష్మి ఒక్కసారిగా షాక్ అయ్యారు. అక్కడికి సెక్యూరిటీ రాగా.. తనకు ఏమీ కాలేదని, కింద పడిన వారికి సాయం చేయండని బొత్స సూచించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నాసిరకంగా వేదిక ఏర్పాటు చేశారని వైసీపీ నేతలు ఆరోపణలు చేశారు. సిరిమానోత్సవానికి అనుగుణంగా ఏర్పాటైన వేదిక మౌలికంగా బలహీనంగా ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని పలువురు విమర్శిస్తున్నారు.

# ఉప్పాడ మత్స్యకార సమస్యలు

- పరిష్కర్ కోసం కమిటీ వేసిన ప్రభుత్వం

**అమరావతి,అక్టోబరు7 ( వెలుతురు):**
ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఓ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో పరిశ్రమలు, మత్స్య శాఖ కమిషనర్లు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ, కాకినాడ జిల్లా కలెక్టర్ ఉంటారు. వీరితోపాటు కాకినాడ జిల్లా కలెక్టర్ ద్వారా నామినేట్ అయ్యే మత్స్యకార వర్గానికి చెందిన సభ్యులు ఈ కమిటీలో ఉండనున్నారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఈ కమిటీ కృషి చేయనుంది. మత్స్యకారుల సమస్యలపై తక్షణం స్పందించి కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.



# స్థానిక ఎన్నికల్లో పోటీకి మల్లన్న సిద్ధం

**- పార్టీకి గుర్తు కేటాయించాలని హైకోర్టులో పిటిషన్**

**- తగు చర్యలు తీసుకోవాలని ఇసిని ఆదేశించిన హైకోర్టు**



**హైదరాబాద్,అక్టోబర్7( వెలుతురు):**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బిసిలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడ్డ ఈ పార్టీ రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పార్టీ గుర్తింపు, పార్టీ గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాగా.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం లక్ష్యంగా ఇటీవల తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీన్మార్ మల్లన్న స్థాపించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణ హోటల్‌లో పార్టీని స్థాపించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండాపై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు. పిడికిలి కింది భాగంలో పార్టీ పేరును ముద్రించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని మల్లన్న కోరడం.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో... మల్లన్నకుఎన్నికల సంఘం ఎలాంటి గుర్తును కేటాయిస్తుందో అన్న ఆసక్తి పెరిగింది.

# ఖమ్మం పరిశుభ్రత బాధ్యత ప్రజలదే


**- నగరాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుదాం**

**- ప్రజలకు మంత్రి తుమ్మల సూచన**



**ఖమ్మం,అక్టోబర్7( వెలుతురు):**
ఖమ్మం నగరాన్ని అందంగా తీర్చి దిదద్దడంతో పాటు, పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పట్టణం గతంలో చిన్న పంచాయతీగా ఉండేది, కేవలం 4 వేల జనాభా మాత్రమే ఉండేవాళ్లు అన్నారు. ఇక, మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి, డివిజన్ కు కావలసిన మౌలిక సదుపాయాలు కమిషనర్ అభిషేక్ అగస్త్యను సంప్రదించండి అని సూచించారు. మన కార్పొరేషన్ ను చూసి ఇతర ప్రాంతాలు నేర్చుకునేలా ఉండాలి అన్నారు. నగరం ప్రశాంతమైన వాతావరణం ఉండాలి, కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి తుమ్మల కోరారు. అయితే, ఉన్నతమైన చదువులు చదివితే ఆ కుటుంబం పేదరికాన్ని వీడుతుంది అని మంత్రి నాగేశ్వరరావు తెలిపారు. నగర వాసులకు హైదరాబాద్, అమెరికా కంటే మంచి చదువు ఖమ్మం నగరానికి వస్తుంది అని భరోసా ఇచ్చారు. పోలీసులకు సూచించా పార్టీల పరంగా పోలీసులు ఎవరి పైనా కేసులు పెట్టొద్దని.. అలాగే, రోడ్ల వెడల్పు కోసం నాయకుల ఇండ్ల అయినా కొంత తీసుకోక తప్పదు అన్నారు. బైపాస్ రోడ్డు వేసినప్పుడు నన్ను తిట్టుకున్నారు, ఇప్పుడు బైపాస్ రోడ్డు కూడా జామ్ అవుతుంది.. ఇంకా రెండు మూడు వందల కోట్ల రూపాయలు సీఎం రేవంత్ రెడ్డినీ అడిగి తీసుకుని వస్తాను.. గుడిసెల్లో బ్రతికే పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. పేదలకు మంచి చేసే విధంగా రాజకీయం ఉండాలి, ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదని తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

# స్టాక్ మార్కెట్‌లో వరుస లాభాలు



**ముంబయి,అక్టోబర్ 7( వెలుతురు):**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు సూచీలకు బలాన్ని ఇచ్చాయి. క్యూ2 ఫలితాల సీజన్ ప్రారంభం వేళ ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. ఈ కారణంగా సూచీలు స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 81,883.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,790.12) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,309.56 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో లాభాల స్వీకరణతో 136.63 పాయింట్ల లాభంతో 81,926.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 30.65 పాయింట్ల లాభపడి 25,108.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.78గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.34 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3957 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన బీసీ విద్యార్థి సంఘము జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ మరియు అనుబంధ సంఘ నాయకులు





**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 07:**
మంగళవారం రోజున బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘ ఆధ్వర్యంలో కరీంనగర్ కోర్టు చౌరస్తా లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్ మరియు బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘ నాయకులు పూలమాలవేసి వినతి పత్రం సమర్పించినారు. అనంతరం విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీలమంతా గత 22 నెలలుగా పోరాటం చేసి సాధించుకున్న 42 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలని , ఈ రిజర్వేషన్లను అడ్డుకుంటే రాష్ట్రంలో అగ్గి రాజేస్తం అని 42% రిజర్వేషన్లు ఇది బీసీలకు ఇది ఎవరికి ఇచ్చే బిక్ష కాదు అని విక్రమ్ గౌడ్ హెచ్చరించారు. రెడ్డి సంఘం నేతలు అడుగడుగునా అడ్డుకుంటున్న విషయం మీకు తెలియనిది కాదు, ఇలాంటి సమయంలో బీసీలను 42 శాతం రిజర్వేషన్ లు రక్షించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమానికి పూనుకోవాల్సిన అవసరం ఏర్పడింది, రెడ్డి సంఘం వారు వేసిన రిజర్వేషన్ల వ్యతిరేక పిటిషన్ ఈనెల 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో విచారణకు రానున్నది కావున ఈ అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని బీసీ జాతినీ అవమానిస్తూ, మనకు రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటను అడ్డుకుంటున్న రిజర్వేషన్ వ్యతిరేకులకు బుద్ధి చెప్పడానికి మంగళవారం రోజున (7 తేదీన) మన జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాలలో మన మహనీయులైన మహాత్మ జ్యోతిబాపూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహల వద్ద శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మన బీసీ ఉద్యమ నేత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శీనన్న పిలుపును ఇవ్వడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎన్నం ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు , విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి. జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , చారి యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ , రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరశురామ్ గౌడ్ , రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, రాష్ట్ర ప్రచారకర్త జి ఎస్ ఆనంద్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు మాచర్ల అంజయ్య గౌడ్ , పార్లమెంట్ కన్వీనర్ కాయతోజి బ్రహ్మచారి , గంగిపల్లి అరుణ , దేవరకొండ సంతోషిని , బోయిని ప్రశాంత్ , బియ్యం తిరుపతి మరియు బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# పిసి ఘోష్ కమిషన్‌పై విచారణ

**- 12వతేదీకి వాయిదా వేసిన హైకోర్టు**

**హైదరాబాద్,అక్టోబర్ 7( వెలుతురు):**
కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరపున లాయర్ నిరంజన్ రెడ్డి ఈ విచారణ



సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. కమిషన్ నివేదికలో తమ పేర్లు ప్రస్తావించబడిన నేపథ్యంలో ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఉండాలని వారు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సీబీఐకి పంపిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు, ఆ నివేదిక ఆధారంగా నేరుగా చర్యలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ తన స్వతంత్ర విచారణను చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వచ్చే నెల 12న జరగనుంది. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ సీఎస్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది.

# నగరంలో బస్ ఛార్జీల పెంపు దారుణం

**- 9న ఛలో బస్ భవన్‌కు బిఆర్ఎస్ పిలుపు**



**హైదరాబాద్,అక్టోబర్ 7( వెలుతురు):**
ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్కి పిలుపునిచ్చింది. ఛార్జీల పెంపు పేదలపై భారం పడుతుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ఆర్టీసీ డ్రైవర్లతోనే ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలు నడపడానికి ఆర్టీసీ ఉద్యోగులకు ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు.

# క్వారీలో పిడుగుపాటు

**- ముగ్గురు కార్మికుల దుర్మరణం**

**శ్రీకాకుళం,అక్టోబరు7 ( వెలుతురు):**
మెళియాపుట్టి మండలంలోని జంగలపాడు రాజయోగి క్వారీలో విషాద ఘటన జరిగింది. ఆకస్మికంగా పిడుగు పడటంతో ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన



వారిని వెంటనే టెక్కలి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో బైపోతు హరిప్రసాద్ పరిస్థితి చాలా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటన సాయంత్రం చీకటి పడిన సమయంలో జరగడంతో సహాయక చర్యలు నిర్వహించడంలో అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. చీకటి కారణంగా రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకాలు కలిగాయి. అయినప్పటికీ, స్థానిక అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు. మృతి చెందిన వారిలో కూలీలు శ్రావణ్ కుమార్ (45, బీహార్), హేమరాజ్ ఈశ్వజీ మేఘవల్ (25, రాజస్థాన్), పింటు (25, మధ్యప్రదేశ్)గా గుర్తించారు. వీరు రాజయోగి క్వారీలో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న వలస కూలీలు. పిడుగుపాటు ఘటన వారి కుటుంబాలను తీవ్ర దుఃఖంలో ముంచెత్తింది. ఘటన స్థానికంగా షాక్‌కు గురిచేసింది. క్వారీలో పనిచేసే కూలీల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. పిడుగు పడే సమయంలో కూలీలు బహిరంగ ప్రదేశంలో పనిచేస్తుండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. స్థానికులు, కూలీల భద్రత కోసం క్వారీ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైలు నుంచి అన్నదమ్ముల తోసివేత

**- ఒకరు మృతి..ప్రణాపాయంలో మరొకరు**

**హైదరాబాద్,అక్టోబరు7 ( వెలుతురు):**
హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళుతున్న దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు అన్నదమ్ముల్ని తోటి ప్రయాణికుడు రైలు నుంచి కిందకు తోసేయడంతో ఒకరు మరణించగా మరొకరు కోమాలోకి వెళ్లిపోయారు. ఘట్‌కేసర్ వద్ద ఈ దారుణం జరిగింది. బాధితులను మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్వాని సోదరులుగా పోలీసులు గుర్తించారు. అన్నకు 33 ఏళ్లు, తమ్ముడికి 30 ఏళ్లు అని చెప్పారు. వారి మధ్య ఘర్షణకు కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందగా అన్న కోమాలోకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం అతడికి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న సికింద్రాబాద్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# ములకలచెరువు కల్తీ మద్యం కేసు

**- ఎక్సైజ్ సీఐ హిమబిందుపై బదిలీవేటు**

**మదనపల్లి,అక్టోబరు7 ( వెలుతురు):**
అన్నమయ్య జిల్లా ములకల చెరువులో నకిలీ మద్యం తయారీ ముఠా పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. కల్తీ మద్యం తయారవుతున్నా పసిగట్టలేదని ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందుపై బదిలీవేటు పడింది. విజయవాడ ఎక్సైజ్ కమిషనర్ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిశోర్ కుమార్‌కు ములకలచెరువు బాధ్యతలు అప్పగించారు. ములకలచెరువు- మదనపల్లె పాత రోడ్డులోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న ఓ పాత దాబాను అవాసంగా మార్చుకుని విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు నకిలీ మద్యం తయారు చేశారు. తమిళనాడు, ఒడిశా, విశాఖపట్నంలకు చెందిన పలువురితో తయారు చేయించి బెల్ట్‌షాపులకు సరఫరా చేశారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో దాడులు నిర్వహించాలని కడప ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వేంపల్లి చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు.దీంతో ఆయన రాయచోటూ ఈఎస్ మధుసూదన్, సిబ్బందితో దాడులు చేసి రూ. 1.75 కోట్ల విలువైన నకిలీ మద్యంతో పాటు తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరో 15 వేల ఖాళీ సీసాలు, 1,050 లీటర్ల స్పిరిట్, సరఫరాకు ఉంచిన 1,500 లీటర్ల నకిలీ మద్యం బాటిళ్లు, ఇతర సామగ్రి, మద్యాన్ని సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేసి పలువురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# స్వాప్నికుడు, సాధకుడు, నిరంతర పథికునికో లేఖ

**కవిత్వమే జీవనమార్గంగా సాగుతున్న బాటసారి కవియాకూబ్ అబ్బాకి,**

***అబ్బా!* అరవైవ వసంతంలో అడుగిడి ఇంకా మునుముందుకు సాగుతున్న దశలో మీకు అక్షరాలమాలలతోనే అభినందనలు తెలిపే అవకాశం వచ్చినందుకు ఎంత ఆనందంగా ఉందో తెలుసా! మీరు మొహమాటంగా 'బేటా!' అంటారు, నాకు తెలుసు. అయినాసరే ఇదే సందర్భం. మనస్ఫూర్తిగా కొన్ని విషయాలు పంచుకునేందుకు ఇదే సరైన సందర్భం. నిజానికి మార్చినెల తలచుకోగానే నాలో మిక్స్ ఫీలింగ్స్ ముప్పిరిగొంటాయి. మీరో కవితలో చెప్పినట్టు "దుఃఖాన్ని అల్లుకున్న సంతోషమో, సంతోషాన్ని చుట్టుకున్న దుఃఖమో ఒకదాన్నొకటి పెనవేసుకున్న బ్రతుకును పదేపదే గుర్తుచేస్తూ"......**

**(తీగలచింత-1, ప్రవహించే జ్ఞాపకం)**

మార్చ్ నెల నాకు సంబంధించి దుఃఖాన్ని అల్లుకున్న సంతోషం, సంతోషాన్ని చుట్టుకున్న దుఃఖం. మార్చి 3, మా పాప స్నిగ్ధ (అమ్ము) పుట్టినరోజు. 2016 లో అది కాలంకడుపులో దూరిపోయాక మార్చ్ ఎప్పుడూ ఓ దుఃఖస్మృతి. 2018 మార్చిలో 2 వ తేదీ రాగానే తెలిసింది అది ఓ అద్భుతమైన వ్యక్తి జన్మించిన రోజనీ, నాన్నవంటి మనసున్న మీరు పుట్టిన నెల అని. ఒకే రోజు తేడా – ఒక రోజు మనసుకు ఉత్సవం, ఒకరోజు మనసంతా స్మృతివనం. ఇది కదా విరోధాభాస. ఇదో ఇలాంటి భావాలరాశులను, ఇలా ఫలానా అంటారని, ఇది విరోధాభాస అని, ఇంగ్లీష్ లో పారడాక్స్ అంటారని ఎరుక పట్టించింది కవిసంగమం.

ఇటువంటి మరెన్నో ఉదాహరణలు. ఓ కొత్త చూపుతో మనసులోకి తొంగిచూసి, కొంగొత్త ఎరుకతో భావాలను ప్రకటించగల నేర్పును ప్రసాదించింది మన కవిసంగమం.

ఆ రోజు ఇంకా గుర్తుంది. పుస్తకపు పొత్తిళ్ళలో తలదాచుకుని, అక్షరాల ఆక్సిజన్ తో ఊపిరి నిలబెట్టుకుంటున్న తరుణం. నా కొన్ని అక్షరాలు అంటూ నాకనిపించిన భావాలన్నీ అక్షర రూపంలో పెడుతూ వ్యాసాలుగా కవితలుగా నవతెలంగాణా పత్రిక లో ప్రచురితమవుతున్న సమయం. సెప్టెంబర్14, 2017 వాహెద్ గారి సలహాతో కాస్త బిడియంగానే కవిసంగమం గ్రూప్ లో అడుగుపెట్టాను. కవిత్వం హృదయసంబంధి అయినప్పటికీ, ఎవరికంటే వారికి పట్టుబడేది అవనప్పటికీ, అక్షరాభ్యాసం మాదిరిగా ఒకరు కూర్చోబెట్టి దిద్దబెట్టేది కానప్పటికీబీ కవిత్వం అంటూ రాసాక తీర్చిదిద్దుకోవచ్చనీ, దానికంటూ రూపురేఖలుంటాయనీ తెలిసింది ఇక్కడ. కవిత్వం స్వయంగా ఓ భాష అనీ, అది ఓ ప్రత్యేకమైన కళ అనీ, కనుకే అన్ని రోజులూ నాకు పఠనం లోనూ రచనలోనూ అంత ఆనందం దొరికిందనీ అర్థమైంది. ఇక్కడే నా చూపు విస్తృతమైంది. అవగాహన పరిధి విశాలమైంది. అధ్యయనం అపరిమితమైంది.

కవి కంటె ముందు ఎప్పటికీ మంచి పాఠకుడిగా ఉండాలని తెలిసింది. అప్పుడే అక్కడ శీర్షికల్లోనూ, స్పందనల్లోనూ ఉపయుక్తమైన అనేక విషయాలు ఆకళింపుకొస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కవులకు, ఓ నిర్మాణాత్మక శక్తి గానూ చోదకంగానూ కవిసంగమం పనిచేస్తుంది. ఆలోచన ఆవేదన ఆవేశం ఆక్రోశం నిరసన నిస్సహాయత నిగ్గదీత ఉద్వేగమేదైనా అక్షరాల్లో ప్రకటించగల కలధారులకు అదొక విద్యాలయమై భాసిల్లుతోంది. అటువంటి కవిసంగమ వ్యవస్థాపకులు మీరు.

**"మానవ వికాసం కోసం కవిత్వం" మీ నినాదం.**

ఈ వాక్యం పలికినంత సరళం కాదు కదా ఆచరణ. "మనిషి కోసమై మనిషి వెతుక్కునే రోజు వచ్చే సమయమొకటి వేచి ఉంది ఈ ప్రపంచానికి" (ఫనా నిజామీ) అని కదా మీ భయం. ఆ రోజు రాకుండా ఉండాలని మీ ప్రయత్నం. ఈ ప్రయాణమెంత ప్రయాసమవనీ ప్రయత్నం మానరు.

**'మరి ఏ మోహం ఇతన్ని నడిపిస్తుంది. ఎందుకంత శ్రమ ఈ మనిషికి?' అని ఎవరైనా అంటే.. నేనంటాను..**

'అతన్ని మనిషితనపు మోహం నిలువనీయదు.
నిరంతరం కవిత్వ జ్వరపీడితుడై
విలవిలలాడుతుంటాడు.
ఆయన తహతహ, తపన అంతా..
జీవనదిలెక్క కవిత్వం ప్రవహించాలి.
మెదళ్ళు వికసించాలి.
మనుషులంతా మనుషుల్లెక్క జీవించాలి' అని.
'కవిత్వం తన మార్గం. కవిత్వం తన ప్రయాణం.
కవిత్వం తన విశ్వాసం.' అనీ చెప్తాను. ఇన్నాళ్ళ నా గమనింపు నుంచి నమ్మకం తో చెప్తాను.
"కళ్ళు మూసి తెరిస్తే పద్యం.
కదిలితే, మెదిలితే, కన్నీళ్లు పెడితే, ఉద్వేగపడితే,
గాద్గద్యమైతే
కలిస్తే, చరిస్తే, వెక్కిపడితే, జ్వలిస్తే పద్యం"
(నదీమూలంలాంటి ఆ ఇల్లు)
కవిత్వం రక్తమజ్జాస్థిగతం అయితే తప్ప ఇలా అనలేరు.

******

"నిన్నూ సమూహాల్నీ కలిపే రహదారి కవిత్వం" అన్నారు. "కవిత్వం నన్ను వెంటాడుతున్న నీడ" అనీ చెప్పుకున్నారు.


అబ్బా! మీ గురించి మాటాడాలని ఎప్పుడు మొదలెట్టినా, మీలోని కవి కళ్ళ ముందు నిలబడతారు. కవిని గురించి సంభాషించాలనుకుంటే మీలోని మనిషి డామినేట్ చేస్తాడు. ఆ మనిషితనపు మాధుర్యం తెలుస్తుండగానే, అంతకుమించిన మీ స్వప్నం తెరపైకి వస్తుంది. అప్పుడనిపిస్తుంది, మీ కవిత్వం గురించి మాట్లాడిన ప్రతి ఒక్కరూ, తెలియకుండానే మీలోని మనిషిని, మీ స్వప్నాన్నీ స్పృశించకుండా ముగించలేరు. మొత్తంగా మీరొక స్వాప్నికుడు.

సమకాలీన సమాజానికి సమాంతరంగా వికాసాన్ని సృష్టించాలని మీ కల.

మనిషికి మాత్రమే చోటుండే ఓ 'వ్యవస్థ'ను స్వప్నిస్తున్నారు. ఆ స్వప్న సాధనకు మీరెంచుకున్న తోవ కవిత్వం. అదే అసలైన తోవ అని మీ నమ్మకం. ముళ్ళూ రాళ్ళూ ఇరుకూ ఉన్న తోవను కాస్త విశాలం చేసి అందరినీ ఆహ్వానిస్తున్నారు. ఎందుకంటే మీరు కలగంటున్న స్వప్నం లో చోటు మీ ఒక్కరిదే కాదు గనుక.

కడుపులో చల్ల కదలకుండా, కంటి నిండా నిద్దరోయి కులాసాగా కంటున్న కల కాదు మీది. మీ 'బతుకు కథ' పొంటి పల్లేరుగాయాల గాథలున్నయ్. ఆకలి అవమానం కవలపిల్లలు. పేదరికానికి తోబుట్టువులు. మట్టి.. చెమట.. చదువు.. బతుకు విలువలు తెలుపుతూ స్ఫూర్తిదాయకంగా నిలిచే జీవితం మీది. మీ బతుకు కథలో ఎల్లప్పుడూ గిజిగాడై పుల్లా పుడకా పేర్చి గూడునల్లుతునే ఉన్నారు.

"..పాటలల్ల ఆనందం ఎతుక్కున్న బాల్యం.. కష్టమెంత పడ్డా కటకటగ ఎల్లెటి ఇంట్ల పసితనంల పని విలువ తెలిసిన బాల్యం... ఎండల కాళ్ళు కాలుతున్నా కరిగిపోకముందే ఐస్ క్రోట్ లు అమ్మిన అనుభవం ...



అన్నం పెట్టిన చేతుల్ని, చదువుకు చేయూతనిచ్చిన ఇంటిని మర్చిపోలేని కృతజ్ఞతాభావం.. జీవితంల విలువలన్నీ కరిగిపోకుంట కాపాడుకున్నట్టుంది" అని మీ బతుకుకథ చదివి నా డైరీలో రాసుకున్న.

రావెళ్ళ పురస్కారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో మీరు అందుకున్నప్పుడు, అవార్డు స్వీకర్తగా కంటె సామాన్య కార్యకర్త గా మీ ప్రవర్తన విలువల ఆచరణను చెప్పకనే చెప్పింది.

******

కవితలుగా, స్పందనలుగా మిమ్మల్ని కవిసంగమం లో అప్పుడప్పుడూ చదువుకున్నప్పటికీ, మీరు స్వయంగా తెలుగు అధ్యాపకులని ఎరుక ఉన్నప్పటికీ, ఓ పుస్తక రూపంలో నాకు అందుబాటులో దొరికింది మాత్రం మొదటగా మీ పరిశోధనా గ్రంథం "ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ". అది చదివాక మరింత గౌరవం పెరిగింది. ఓ కొత్త వాక్యం ఎక్కడైనా కనపడినా, ఓ కొత్త కవి ఎక్కడో రాస్తున్నాడని తెలిసినా, చందమామ కనపడితే సంతోషపడే పసిపిల్లాడిలా ఉండే ఈ వ్యక్తి ఎంతటి అధ్యయన శీలి అని. ఆ తరువాత నేను చదివింది మీ "సృజనానుభవం" వ్యాసాల సంపుటి. 'ఈ వ్యాసాలు నేనొక కవిత్వ విద్యార్థిగా రాశాను' అని చెప్పుకున్నారు. ఇదీ స్థితప్రజ్ఞత. నిరంతరం విద్యార్థిగా ఉండటం ఎలాగో నిశ్శబ్దంగా చేరవేస్తారు.

కవి సోదరుడు ఇబ్రహీం గారి వల్ల, మార్కెట్ లో అందుబాటులో లేని మీ కవిత్వ సంపుటులు చదవగలిగాను. మానవ జీవనంలోని సున్నితమైన.. ప్రేమా ద్వేషమూ ఆప్యాయతా ఆవేదన అన్వేషణ సంఘర్షణ వంటి మనోభావాల సంభావ్యతలను ఉన్నదున్నట్టుగా స్వీకరించారు. అదే కవిత్వం చేశారు. "ప్రవహించే జ్ఞాపకం" లో పట్నాన్ని జీర్ణించుకోలేనితనం ఉంది. ఇమేజరీస్ మధ్య గాఢమైన వేదన ఒదిగిపోయింది. ఒక్కోచోట వస్తువేంటో బయటకు తేలని సీక్రెట్ స్ట్రక్చర్ (గుప్త నిర్మాణం) చూస్తాం. /మనతో మనమే రమించి పునఃసృష్టి కోసం బల్లుల్లా గదుల్లో పచార్లు చేస్తూ/.. /నీడలదుప్పులు గోడలఅరణ్యాల్లో పరుగెత్తుతుంటాయి/.. ఇలా మెటాఫర్స్, సర్రియలిస్టిక్ ఎక్స్ప్రెషన్స్.. వాట్ నాట్ ప్రతిదీ మీ కవిత్వం లో పరిశీలించవచ్చు.. /పెగలని మాటకు అంటిన భాష చెప్పుకోలేని బాధను అనుభవిస్తుంది/.. ఆ బాధానుభవమే మీ కవిత్వం. 'సరిహద్దు రేఖ', 'ఎడతెగని ప్రయాణం', 'నదీమూలంలాంటి ఆ ఇల్లు', 'తీగల చింత' వరుసగా ఈ కవిత్వ సంపుటులన్నీ రానురానూ జీవితంతో పెనవేసుకున్న అనుభవాల సాంద్రత ఎంతో చెప్తాయి. కవిత్వ వ్యక్తీకరణ, నిర్మాణాల్లో వచ్చిన గుణాత్మక పరిణామం కనిపిస్తుంది.

క్రిస్టల్ క్లియర్ గా వస్తువు ప్రదర్శింపబడటం, సరళత, సహజ సంభాషణా శైలి కనిపిస్తున్నాయి. మూలాలతో ఎల్లప్పుడూ ప్రయాణించే కవిగా, కవిత్వ భాష మీ మూలాలకు అర్థం అవాలనుకున్నారా!

"..In my poems I couldn"t shut the doors to the street,..." అన్న పాబ్లో నెరుడా మాటలు మీరు ఓన్ చేసుకోవటం చూస్తే, మీ కవిత్వ నిర్మాణ వ్యూహ ప్రధాన లక్ష్యం కవిత్వాన్ని సామాన్యునికి చేరవేయటమే అనేది స్పష్టమవుతుంది.

"..అరికాళ్ళకు అంటి
ఇంకా మిగిలిఉన్న పల్లెటూరి మట్టి
ఎంత కడిగినా వదలదు.."(ఇంగా.. ఉంగా)

******

వ్యక్తీకరణ కు అనుభవం కేంద్రం. మీ కవితా పంక్తులు, ఖండికల నిర్మాణంలో అనుభవాల క్రమం కనపడుతుంది. దాదాపు మూడున్నర దశాబ్దాల కవిత్వ ప్రయాణం అనుకుంటా కదా మీది. ఎన్ని పరిణామాలు చూసి ఉంటారు. అంతర్జాతీయంగా అనేక పరిణామాలు, దేశ ఆర్థిక పారిశ్రామిక సాంస్కృతిక సాంఘీక సామాజిక వైయుక్తిక రాజకీయ రంగాలపై చూపిన పెను ప్రభావాలుబీ యూరోపియన్ పరిణామాలు, ప్రపంచీకరణ, వీటి నేపథ్యంలో భారతీయ గ్రామీణ జీవన విధ్వంసం, మానవ సంబంధాల పతనం. వీటన్నింటినీ మించి, రాజకీయ రంగంపై కులం మతం జడలు విరబోసుకుని మనిషికి మనిషికి మధ్య విభజన రేఖను స్పష్టంగా గీసిన కాలాన్ని అనుభవించారు. ఊపిర్లను ఊచకోత కోసిన క్రూర సందర్భాల్ని, ప్రాణాల్ని పరుగెత్తించిన రోజుల్నీ, క్షణాల్లో వెయ్యో వంతులో పక్కవాడికి పరాయివాళ్ళైపోయిన సమయాల్నీ ప్రత్యక్షంగా చూసిన అనుభవాలు. విప్లవం, ఉద్యమం జీవన శైలిగా మారాల్సిన అనివార్యతల మధ్య కవిత్వం. ఇవన్నీ మీ కవితల్లో చూశా.

మరో ముఖ్యమైన అంశం. ఎగ్జిస్టెన్స్. మన తెలుగు సాహిత్యం లో స్త్రీ, దళిత, ముస్లిం మైనారిటీ అస్తిత్వ వాదాల శకం మొదలైనప్పట్నుంచీ, ఇప్పటివరకూ. ఎవరి నొప్పికి గొంతుక వారిదే అయిన కాలం. మీరూ మీ గళాన్ని గట్టిగానే వినిపించారు. చాలా కవితల్లో సమూహానికి ప్రతినిధిగానే కనిపించినా అంతిమంగా మానవతా వాదాన్ని వినిపించారు.

"..సరిహద్దుల మధ్య, సన్నాయి నొక్కుల మధ్య సదా విశ్వసంగీతాన్ని వినిపించడం నాకిష్టం" (నాకిష్టం) తక్షణ స్పందన పట్ల మీకంత సుముఖత లేనప్పటికీ, గుజరాత్ గాయం వంటి అన్ని అనివార్యతల్లోనూ మీ వైఖరి ఏమిటో కవిగా మీరు స్పష్టం చేసేందుకు తక్షణతను ఆశ్రయించారు. రాజ్యహింసను సమర్థంగా ఖండించారు.

మీ కవిత్వ సంపుటులన్నీ దేనికదే తనదైన ముద్ర. 'నదీమూలంలాంటి ఇల్లు' ఎందరో పాఠకుల, ప్రముఖుల హృదయాల్ని చూరగొంది. నాకెందుకో మీ "సరిహద్దురేఖ" సంపుటి మీ ఆత్మ అనిపించింది. ఇన్నేసి పరిణామాల క్రమంలో, ప్రతీ సందర్భంలోనూబీ సామాజికంగానూ, రాజకీయంగానూ, మానసికంగానూబీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో కవిత్వం ఎలాంటి ప్రభావం చూపగలదో, ఎటువంటి ఎరుక ను కలిగించగలదో స్వయంగా చూశారు గనుకే కవిత్వం పట్ల మీకంతటి నమ్మకం.

******

ఫిలాసఫర్ కవి కాలేరు కానీ, కవిలో తాత్వికుడు ఉంటాడు. కాలంతో పాటు అనుభవాల సాంద్రత. సామాజిక మార్పుల ఎరుక, అధ్యయన పరిశోధనల జ్ఞానం. తార్కిక చింతన తాత్విక ధోరణి సహజం. అయినా ఉద్వేగాల స్థాయి అదే. మీ కొత్త కవిత్వం "తీగలచింత" చదవగానే..

"ఇది
ఎన్నటికీ తెగనీ ముడిపడని యాతనల తలపోత
ఊపిరాడనీయని ఉక్కిరిబిక్కిరితనాల్లో మనసు చెమరింత
వెచ్చని వెతల కలవరింత
ఉప్పని కన్నీళ్ళ చప్పరింత
పచ్చని కలల పలవరింత
ఇది
కవిదేనా..!! ఊహూ..
ఇది
సమాజపు సమస్త సంకుచితాల అంచున
మానవ జీవన యానపు పెనుగులాట
ఇది
మనిషీ మనిషీ కలనేతకై
ఓ గుండె గొంతుక కొట్లాట.
ఇది
ఓ స్థితప్రజ్ఞుని శిశుక్రందన." అని రాసుకున్నాను.

******

ఏ తరంలోనైనా 'మార్పు' రావాలంటే యువత పూనుకోవాలి. ఆ యువతరం మనస్సు గెలవాలంటే వారి దారిలోనే నడవాలి. నడుస్తున్నది సాంకేతిక యుగం. ఫేస్బుక్ సోషల్ మీడియా ను కవిత్వ వేదికగా మలుచుకోవటమే మీ గెలుపుకు మొదటి సోపానం. మార్పును మన సంకల్పానికి అనువుగా మలుచుకోవటమే మనమెళ్ళే మార్గంలో గొప్ప మలుపు. దశాబ్దకాలంగా మీరాపనే చేస్తున్నారు. కవిసంగమం గ్రూప్, మూడుతరాల కవిసంగమం, ఊరూరా కవిసంగమం. కవిత్వం పై అపారమైన నమ్మకం మీలో.. నేడు నాలో.. రేపు అందరిలో..

మొత్తం గా మీ ప్రయాణం అంతా గమనిస్తుంటే, ఒకరకంగా కవిత్వాన్ని ఓ ఉద్యమం గా నడిపి, ఓ వ్యవస్థ గా స్థిరీకరించే క్రమంలో సాగుతున్నట్టు కనిపిస్తుంది. %మీఎఱఅ్ర శీట ఖ స్త్రవఅ% అంటుంటారు అలా ఓ తరాన్ని కలగంటున్న మీరు ఓ రీఫార్మర్. సమకాలీనతను దాటుకున్నాక మన తెలుగు కవిత్వ ప్రపంచం మిమ్మల్ని ఓ సంస్కర్త గా మాట్లాడుకుంటే అది మీరు చేపట్టిన చర్యల ఫలితమే తప్ప మరొకటి కాదు.

"తొందరగా రా..
ప్రేమ వేడుకలాంటి అక్షరాల పండుగ చేసుకుందాం.."
(ప్రేమ ప్రసారం– పేజీ 98)

అలాగే అబ్బా
అక్షరాల పండుగ చేసుకుందాం. మీరు ఇలాగే కవిత్వ దీపధారియై నూరు శరత్తుల వెన్నెల కాలాన్ని దాటాలని కాంక్షిస్తూ..

కృతజ్ఞతలతో,

**ఇట్లు**

**మీ ప్రయాణతత్వాన్ని ఇష్టపడే మీ అమ్మాయి,**

**ఫణిమాధవి కన్నోజు**

(అక్టోబర్ 13 న రవీంద్రభారతిలో కవియాకూబ్ సృజన సమాలోచన సదస్సు)

# పారదర్శకంగా ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తు

**- ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు: కేంద్రమంత్రి**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 7( వెలుతురు):**



అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంపై నిష్పక్షపాత దర్యాప్తు సాగుతోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. దర్యాప్తుపై వస్తోన్న ఆందోళనలను రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. దర్యాప్తులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని.. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతోందన్నారు. విమాన ప్రమాదంపై 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఇచ్చిన ప్రాథమిక నివేదికపై విమర్శల నేపథ్యంలో కేంద్ర మంత్రి ఇలా స్పందించారు. విమాన ప్రమాదాల వ్యవహారాలను చూసే బాధ్యత ఏఏఐబీది. కేవలం వాస్తవాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. ఎవరి ప్రభావం దీనిపై ఉండదు. నిబంధనల ప్రకారం.. పారదర్శకంగా, స్వతంత్ర పద్ధతిలో దర్యాప్తు జరుగుతోంది. ప్రాథమిక నివేదికపై వ్యాఖ్యలు చేయడం తొందరపాటే అవుతుంది. అసలేం జరిగిందనే విషయంపై స్పష్టత రావాలంటే తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దిల్లీలో ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విలేకరులతో మాట్లాడారు. దేశంలోని అన్ని బోయింగ్ 787 విమానాల్లో క్షుణ్నంగా తనిఖీలు చేయాలని, ఎలక్ట్రికల్ వ్యవస్థల పనితీరుపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ 'ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్(ఎఫ్ఐపీ)' ఇటీవల డీజీసీఏకు లేఖ కూడా రాసిన విషయం తెలిసిందే. బోయింగ్ విమానాల్లోని భద్రత ప్రమాణాలపై గతంలోనూ తాము ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని అందులో గుర్తు చేసింది. ఈ క్రమంలోనే పౌర విమానయాన శాఖ మంత్రి క్లారిటీ ఇచ్చారు.

# 9న జగన్ ర్యాలీకి అనుమతి ఇవ్వలేం

**- అనకాపల్లి ఎస్పీ తూహిన్ సిన్హా స్పష్టీకరణ**

**అనకాపల్లి,అక్టోబర్ 7( వెలుతురు):**

విశాఖలో జగన్ రోడ్‌షాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఇటీవలి కరూర్ ఘటన దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి మాకవరపాలెం వరకూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోడ్ షోకు అనుమతి ఇవ్వలేమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ప్రకటించారు. మాకవరపాలెంలో నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీ పనులను పరిశీలించడానికి ఈ నెల 9వ తేదీన జగన్ రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ విశాఖ నుంచి మాకవరపాలెం వరకు 63 కిలో మీటర్ల జాతీయ రహదారిపై కాన్వాయ్‌తో రావడానికి వైసీపీ శ్రేణులు అనుమతులు కోరినట్లు తెలిపారు. విశాఖ నుంచి మాకవరపాలెం వరకు హెలికాప్టర్‌పై మాజీ సీఎం జగన్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. జాతీయ రహదారి రోడ్డు మార్గంలో కూడళ్ల వద్ద జన సమీకరణ చేసే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా రోడ్డు మార్గంలో మాజీ సీఎం జగన్ పర్యటించేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. మాకవరపాలెం మెడికల్ కళాశాల వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేసి జగన్ మోహన్ రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చేలా అనుమతి ఇచ్చామన్నారు. తమిళనాడులో ఇటీవల విజయ్ నిర్వహించిన రోడ్ షోలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, వందమందికి పైగా గాయపడ్డారని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్ట కరమైన సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందులో భాగంగానే మాజీ సీఎం జగన్ 63 కిలోమీటర్ల మేర కాన్వాయ్‌తో ప్రయాణించేందుకు అనుమతిని నిరాకరించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు.




మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటనపై ఉత్కంఠకు తెరలేపింది. రోడ్డు మార్గం ద్వారా మెడికల్ కాలేజ్ పరిశీలనకు వెళ్లేందుకు అనుమతి లభించలేదు. తమిళనాడు కరూర్‌లో తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో రోడ్డు మార్గం ద్వారా జగన్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ప్రకటించారు. జగన్ టూర్ కోసం భారీ జన సమీకరణ జరుగుతున్నందున 63 కిమీ రోడ్డు మార్గం ద్వారా వెళ్లేందుకు అవసరమైన భద్రత కల్పించడం కష్టం అని ఎస్పీ అన్నారు. హెలికాప్టర్ ద్వారా మెడికల్ కాలేజ్ పరిశీలనకు వెళ్లేందుకు అనుమతి కోరితే పరిశీలిస్తామని చెప్పారు.

# భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**విదేశాలకు తరలించే క్రమంలో ఢిల్లీ పోలీసుల దాడి**



**న్యూఢిల్లీ,అక్టోబరు7 ( వెలుతురు):**

దిల్లీలో పోలీసులు భారీగా ఎర్రచందనం నిల్వలను పట్టుకున్నారు. దాదాపు 10 టన్నుల దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6 కోట్లు వరకూ ఉంటుందని తెలిపారు. చైనాతోపాటు ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసేందుకుగానూ.. వాటిని తిరుపతి నుంచి దేశ రాజధానికి తరలించినట్లు తెలుస్తోందన్నారు. ఎర్రచందనం దుంగల చోరీకి సంబంధించిన ఓ కేసులో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇచ్చిన నిఘా సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు దిల్లీ సౌత్ ఈస్ట్ డీసీపీ హేమంత్ తివారీ వెల్లడించారు. ఎర్రచందనం దుంగల చోరీకి సంబంధించి తిరుపతిలో ఓ కేసు నమోదైంది. అక్కడి పోలీసుల దర్యాప్తులో భాగంగా.. వాటిని దిల్లీకి అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగా.. దిల్లీ పోలీస్ ఎస్‌టీఎఫ్, ఆంధప్రదేశ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లు కలిసి దిల్లీ తుగ్లకాబాద్‌లోని ఒక గోదాంలో తనిఖీలు చేపట్టాయి. ఎర్రచందనం నిల్వలను స్వాధీనం చేసుకున్నాయి' అని డీసీపీ హేమంత్ తివారీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇర్ఫాన్, మహారాష్ట్రకు చెందిన అమిత్ సంపత్ పవార్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులకు అంతర్జాతీయ ముఠాతో సంబంధాలు ఉన్నాయన్నారు.

https://epaper.velthuru.com

# వెలుతురు

cinema

## కాంతారా మూవీకి క్రికెటర్ రాహుల్ ఫిదా

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1' దసరా కానుకగా



ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫిదా అయ్యారు. తన ఇన్‌స్టా స్టోరీలో దీనిపై పోస్ట్ పెట్టారు. కాంతార చాప్టర్ 1 చూశాను. మరోసారి రిషబ్ తన ప్రతిభతో మేజిక్ చేశారు. మంగుళూరు ప్రజల నమ్మకాన్ని తెరపై అద్భుతంగా చూపించారని కేఎల్ రాహుల్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు కాంతార టీమ్ స్పందించింది. ఇది చూశాక ఎంతో గర్వంగా ఉందని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇది టీమ్ అందరికీ నిజంగా విన్నింగ్ మూమెంట్ అని పేర్కొంది. కేఎల్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది. కేఎల్ రాహుల్ తనకు 'కాంతార' సినిమా అంటే ఎంతో ఇష్టమని ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించిన తర్వాత రాహుల్ చేసుకున్న సెలబ్రేషన్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై కేఎల్ స్పందిస్తూ.. మ్యాచ్ గెలిచాక సెలబ్రేషన్స్ నా ఫేవరెట్ సినిమాల్లో ఒకటైన 'కాంతార' స్ఫూర్తితో చేశాను. నేను ఇక్కడ ఆడుతూ పెరిగాను అని చెప్పడం నా సెలబ్రేషన్స్ ఉద్దేశం అని తెలిపారు.




## జ్యువెలరీ యాడ్ ఫిల్మ్‌లో బాలయ్య కూతురు తేజశ్విని

టాలీవుడ్ లో స్టార్ హీరోల కొడుకులు హీరోలుగా వెండితెరపై ఎంట్రీ ఇస్తారు కానీ వారి



డాటర్స్ మాత్రం స్క్రీన్ పై కనిపించడం అరుదు. గతంలో సూపర్ స్టార్ కృష్ణ కూతురు మంజుల హీరోయిన్ గా బాలయ్య సరసన చేయబోతోంది అంటే ఫ్యాన్స్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. అందుకే చాలా వరకు హీరోల డాటర్స్ స్క్రీన్ పై కనిపించేందుకు ఇష్టపడరు. ప్రస్తుతం స్టార్ హీరోలైన చిరు, బాలయ్య డాటర్స్ నిర్మాతలుగా రాణిస్తున్నారు. వెంకీ డాటర్స్ సినిమాలు దూరంగా ఇతర రంగాలలో రాణిస్తున్నారు. కానీ బాలయ్య చిన్న కూతురు నందమూరి తేజశ్వని ఇప్పుడు కెమెరా ముందుకు వస్తోంది. ప్రస్తుతం అఖండ 2 కు సహ నిర్మాతగా కూడా తేజు వ్యవహరిస్తోంది. ఇన్నిరోజులు తండ్రి బాలయ్య సినిమాల వ్యవహారాలు చూస్తూ వస్తున్న తేజు ఇప్పుడు కేమెరా ముందు నటించింది.
హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్‌కు నందమూరి తేజస్విని బ్రాండ్ అంబాసిడర్ గా వ్యహరిస్తోంది. ఇటీవలే హైదరాబాద్‌లో ఈ యాడ్ షూట్ కూడా ఫినిష్ చేసారు తేజస్విని. ఈ జ్యువెలరీ బ్రాండ్ మరియు ఇతర ప్రమోషన్స్ గురించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## కార్తికేయ తొలిహీరో..అల్లరి నరేశ్

మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన 'కార్తికేయ' చిత్రం కోసం తొలుత అల్లరి నరేశ్‌ను అడిగారట. ఆయనను ఉద్దేశించి కథను సిద్ధం చేసుకున్నట్లు చందు మొండేటి తెలిపారు. ఈ సినిమా నిఖిల్ చేయగా టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సెట్ చేసింది. హీరో నిఖిల్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. సుమారు రూ.6 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.20 కోట్లు వసూళ్లు సాధించింది. ముందుగా ఈ కథను దర్శకుడు చందూ మొండేటి.. నరేశ్‌కే వినిపించారు. స్టోరీ తనకు బాగా నచ్చినా ఒక్క కారణంతో ఆయన ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించలేదు. అదేంటంటే.. సుబ్రహ్మణ్యపురం అనే గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో పాములు ఎక్కువగా కనిపించిన సంగతి తెలిసిందే. ఆ సన్నివేశాలే ఈ సినిమాకి కీలకం. వ్యక్తిగతంగా తనకు పాములంటే భయపడడం వల్ల నరేశ్ ఆ సినిమాని తిరస్కరించారట. ఓ ఇంటర్వ్యూలో ఆయనే ఈ వివరాలు పంచుకున్నారు. బయటేకాదు సినిమాల్లో కనిపించే పాముల దృశ్యాలను చూసినా ఇప్పటికీ భయపడతానన్నారు. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'కార్తికేయ 2' రూపొందింది. 'కార్తికేయ' పార్ట్ 2 నిఖిల్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. ఒకవేళ అల్లరి నరేశ్ 'కార్తికేయ'లో నటించి ఉంటే అప్పటి నుంచే ఆయన సీరియస్ కథల్లో కనిపించేవారేమో. సీరియస్ లుక్‌లో ప్రేక్షకులు తనని అంగీకరిస్తారా, లేదా? అనే సందేహానికి 'మహర్షి' చిత్రంలో పోషించిన రవిశంకర్ పాత్ర జవాబుగా నిలిచిందని, ఆ క్యారెక్టరే పవర్‌ఫుల్ స్టోరీల్లో నటించేందుకు ధైర్యాన్నిచ్చిందని నరేశ్ మరో సందర్భంలోనూ పంచుకున్నారు. వరుసగా యాక్షన్ తరహా స్జబెక్ట్‌లకే పరిమితం కాకుండా కామెడీ సినిమాలూ చేస్తుంటానని చెప్పారు.



## కమల్, రజనీ మల్టీస్టారర్ మూవీ


### తాను దర్శకత్వం వహించడం లేదన్న ప్రదీప్ రంగనాథ్

అగ్ర కథానాయకులు రజనీకాంత్, కమల్‌హాసన్ 46 ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్ పంచుకోనున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ అధికారికమైనప్పటినుంచి దీనికి సంబంధించిన అనేక వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కోలీవుడ్ దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా దీనిపై ఆయన స్పందిస్తూ... తాను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదని తెలిపారు. ఆ సినిమాకు నాకు దర్శకత్వం ఆఫర్ వచ్చిందో, లేదో కూడా నేను చెప్పను. కానీ, నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదు. ఎందుకంటే ప్రస్తుతం దర్శకత్వం మీద కంటే యాక్టింగ్ మీదే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాను. కమల్-రజనీకాంత్ మల్టీస్టారర్ గురించి ఇంతకంటే ఏం చెప్పలేనని అన్నారు. నేను రజనీకాంత్‌కు వీరాభిమానిని. ఇప్పటివరకూ విడుదలైన ఆయన సినిమాలు మొదటిరోజు మొదటి ఆట చూశాను. 'డ్రాగన్' విడుదలయ్యాక ఆయన నన్ను ప్రశంసించారు. ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ప్రదీప్ తెలిపారు. ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్‌హాసన్ ఈ మల్టీస్టారర్ గురించి అధికారికంగా వెల్లడించారు. 'మీరు, రజనీకాంత్ కాంబినేషన్‌లో ఓ సినిమాను ఆశించవచ్చా' అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. ప్రేక్షకులు మా



కాంబినేషన్‌ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసిరానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని స్పష్టంచేశారు. దీంతో ఈ బిగ్ మల్టీస్టారర్ అధికారికమైంది.

## అప్పుడే ఓటిటిలోకి ఇడ్లీ కొట్టు




తమిళ స్టార్ హీరో ధనుష్ ఇటీవల ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా తెలుగులో ఇడ్లీ కొట్టు. అక్టోబర్ 1న దసరా కానుకగా విడుదలైన ఈ సినిమా మొదటి షో నుంచే థియేటర్లలో మంచి హిట్ టాక్ దక్కించుకుంది. విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ఆదరణ ? రెండింటిని సొంతం చేసుకుంది. ఇక తాజాగా ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఎంట్రీకి సిద్ధమవుతున్నట్టు టాక్ నడుస్తోంది.రిలీజ్ అయిన నెల రోజుల్లోపే డిజిటల్ ప్రీమియర్‌కి వస్తుందన్న వార్త ఫ్యాన్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం, ఇడ్లీ కడై ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకొగా. ఈ సినిమా అక్టోబర్ 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుందని టాక్ వినిపిస్తోంది. అంటే, థియేటర్లలో ఇంకా రన్ అవుతున్నప్పుడే డిజిటల్ ఎ÷-లాట్‌ఫార్మ్‌కి రావడం పెద్ద సర్ప్రైజ్. ఇక ధనుష్ కేవలం హీరోగానే కాకుండా రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా కూడా పనిచేయడం ఈ మూవీకి మరింత హైప్ తెచ్చింది. అరుణ్ విజయ్, సత్యరాజ్, సముద్రఖని, నిత్యా మీనన్, షాలిని పాండే వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. గ్రామీణ నేపథ్యంలో నడిచే ఈ కథలో ధనుష్ 'మురుగన్' పాత్రలో కనిపిస్తాడు. కుటుంబ వారసత్వాన్ని కాపాడుకోవడం, ఆధునిక ఆశయాలను నెరవేర్చుకోవడం మధ్య కన్ఫ్యూజ్ అయ్యే యువకుడి ఎమోషనల్ జర్నీని ఈ సినిమా చూపిస్తుంది. చివరికి తన మూలాలను తిరిగి చేరుకునే మురుగన్ పాత్రలో ధనుష్ నేచురల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. తిరుచిత్రంబలం తర్వాత నిత్యా మీనన్‌తో ఆయన జోడీ ఈ సినిమాకు మరో హైలైట్. జివి ప్రకాష్ మ్యూజిక్ కూడా సినిమాకు బలంగా నిలిచింది. మొత్తంగా, థియేటర్లలో బజ్ క్రియేట్ చేసిన ఇడ్లీ కడై ఇప్పుడు ఓటీటీ లోనూ అదే మంత్రాన్ని కొనసాగించనుంది.




### నవ్వులు పూయించేలా ప్రియదర్శి 'మిత్రమండలి' ట్రైలర్

టాలీవుడ్ నటుడు ప్రియదర్శి మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా మిత్రమండలి అనే సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. బన్నీ వాసు ఈ సినిమాను సమర్పిస్తుండగా.. సప్త అశ్వ మీడియా వర్క్స్ మరియు వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ నిహారిక %చీవీ% కథానాయికగా నటించబోతుంది. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించబోతున్నాడు. ఈ సినిమా బ్యాండ్ ట్రూప్ నేపథ్యంలో రాబోతున్నట్లు తెలుస్తుంది.



# రోడ్డు మార్గం ద్వారానే జగన్ పర్యటన

- ఎవరు ఆపుతారో చూస్తాం
- పోలీసులు భద్రత ఇవ్వకుంటే కార్యకర్తలు వస్తారు
- మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ హెచ్చరిక



**అనకాపల్లి,అక్టోబర్ 7( వెలుతురు):** రోడ్డు మార్గం ద్వారా జగన్ పర్యటన జరిగి తీరుతుందని మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఎవరు అవుతారో చూస్తాం. రోడ్డు మార్గం ద్వారానే జగన్ పర్యటన సాగి తీరుతుందన్నారు. మీరు సెక్యూరిటీ ఇవ్వలేకపోతే జగన్మోహన్ రెడ్డిని కాపాడుకునే బాధ్యత వైసీపీ కార్యకర్తలు తీసుకుంటారన్నారు. హెలికాప్టర్ కోసం పర్మిషన్ పెడితే పరిశీలిస్తామని పోలీసులు చెప్పడంపై నాకు వ్యక్తిగతంగా అనుమానాలు ఉన్నాయి. ముందు లేని అనుమతులు ఇప్పుడు ఎందుకు ఇస్తాం అంటున్నారు అనేది మా డౌట్. పోలీసులు ప్రేమలేఖలు రాయడం మానేసి జగన్మోహన్ రెడ్డికి భద్రత కల్పిస్తే సహకరిస్తాం. మెడికల్ కాలేజ్ గురించి వక్ర వ్యాఖ్యలు చేస్తున్న తాగుబోతులు, తిరుగుబోతు పెద్దలకు జగన్ గట్టిగా సమాధానం చెబుతారు' అని గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఈనెల 9వ తేదీన వైఎస్ జగన్ విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి మాకవరపాలెం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. విశాఖ నుంచి మాకవరపాలెం మెడికల్ కళాశాల వరకు వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో జన సమీకరణ చేస్తున్నారు. తమిళనాడులోని కరూర్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో రోడ్డు మార్గాన వెళ్లేందుకు అనుమతి ఎస్పీ తుహీన్ సిన్హా ఇవ్వలేదు. హెలికాప్టర్ ద్వారా వెళ్లేందుకు అనుమతి కోరితే పరిశీలిస్తాం అని, మాకవరపాలెంలో హెలీపాడ్ ఏర్పాటు చేసేందుకు ఎటువంటి ఇబ్బంది లేదు అని ఎస్పీ అంటున్నారు. ఎస్పీ తుహీన్ సిన్హా ప్రకటనపై వైసీపీ స్పందించింది. అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా వైఎస్ జగన్ పర్యటన జరిగి తీరుతుందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. ఖచ్చితంగా మెడికల్ కాలేజ్ పరిశీలన కోసం తమ అధ్యక్షుడు వెళతారు అని తెలిచి చెప్పారు.

# జగన్ అసమర్థత వల్లే వైద్య కళాశాలలకు దుస్థితి

- వైసిపి పాలనా పాపాలు శాపాలుగా మారాయి
- జగన్ బాధ్యతాయుత విపక్షనేతగా వ్యవహరించాలి
- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఘాటు విమర్శలు



**విశాఖపట్నం,అక్టోబర్ 7( వెలుతురు):** గత ప్రభుత్వం అసమర్థ పాలన వలన మెడికల్ కళాశాలలకు ఈ దుస్థితి వచ్చిందని ఎపి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే గత ఐదేళ్లలో కనీసం భూసేకరణ కూడా చేయలేదని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం పాపాలు తమకు శాపాలుగా మారాయని వ్యాఖ్యలు చేశారు. హాస్పిటల్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం పట్టించుకోలేని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. పాడేరులో మెడికల్ కళాశాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేయక పోతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశామని చెప్పారు. జగన్ ఆత్మ పరిశీలన చేసుకొని బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకునిలా వ్యవహరించాలి. జగన్‌కు అసెంబ్లీకి రమ్మని సవాల్ విసిరినా రాలేదు' అంటూ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గిరిజన ప్రాంతాలను విస్మరించిందని.. గిరిజన విశ్వవిద్యాలయం రాకుండా అడ్డుకున్నాని విమర్శించారు. పీపీపీకి ప్రైవేటైజేషన్‌కు తేడా తెలియకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వైద్య కళాశాలలో నిర్మించి ఉంటే ఇప్పుడు ఈ సమస్య ఉండేది కాదన్నారు. వైద్య విద్యను రాష్ట్రంలో పేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళు తోందని స్పష్టం చేశారు. గతంలో తాము చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తుందని వైసీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారుని వ్యాఖ్యలు చేశారు.వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చితే.. తాము ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. పాఠశాలలలో కనీసం నిర్వహణ పనులు గత ప్రభుత్వం చేయలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కళాశాలల పరిశీలనకు వస్తే అదే సమయంలో నేను వస్తాను. మెడికల్ కళాశాలల పరిస్థితిని జగన్‌మోహన్ రెడ్డికి వివరిస్తాను. జగన్ ప్యాలెస్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేసే వరకు లోపలికి వెళ్లారా. నర్సీపట్నం మెడికల్ కళాశాల పరిశీలనకు వస్తున్న జగన్ పార్వతీపురంలో నిర్మించిన మెడికల్ కళాశాల చూసి అక్కడ పరిస్థితిని వివరించాలి. జగన్ ప్రజలను అసత్యాలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ కు గుణపాఠం చెప్పిన మార్పు రావడం లేదు.



# ఇంద్రకీలాద్రికి దసరా ఆదాయం

-1030 కోట్లు దాటినట్లు అధికారుల వెల్లడి

**విజయవాడ,అక్టోబరు7 ( వెలుతురు):** విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర ఆలయానికి రికార్డు స్థాయి హుండీ ఆదాయం వచ్చింది. దసరా నవరాత్రుల 11 రోజుల హుండీని మంగళవారం ఆలయ అధికారులు లెక్కించారు. 2025 దసరా హుండీ ఆదాయం రూ. 10.30 కోట్లు దాటింది. గత సంవత్సరం కంటే ఈ ఏడాది హుండీ ఆదాయం కోటి రూపాయలు ఎక్కువగా వచ్చింది. 2024 దసరా హుండీ నగదు రూ.9.32 కోట్లు కాగా.. 2025లో రూ.10.30 కోట్ల ఆదాయం చేరింది. రెండు రోజుల పాటు హుండీ లెక్కింపులు నిర్వహించారు ఆలయ అధికారులు. మొత్తం 106 సంచులు, 480 హుండీలు తెరచి లెక్కించారు. మొదటి రోజు హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు, రెండో రోజు రూ. 6.73 కోట్ల ఆదాయం చేరింది. మొత్తం బంగారం 387 గ్రాములు, వెండి 19 కేజీలు 450 గ్రాములు వచ్చింది. పలు దేశాల నుంచి విదేశీ కరెన్సీ ఇచ్చారు. భక్తుల విరాళాలతో అమ్మవారి హుండీ ఆదాయం రికార్డు స్థాయికి చేరింది. ఈ మేరకు విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com